# భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను చట్టము, 2020

## [2020లోని 14వ చట్టము]

**[20 సెప్టెంబరు, 2020]**

**నాణ్యమైన మరియు ఈయగలిగిన వైద్య విద్య అందుబాటును మెరుగుపరచి, దేశములోని అన్ని ప్రాంతములలో భారతీయ వైద్య విధానములోని అధిక నాణ్యత గల వైద్య నిపుణులు సరిపడినంతగా మరియు అందుబాటులో ఉండేటట్లు చూచునట్టి; సామాజిక ఆరోగ్య దృష్టికోణమును ప్రోత్సహించి అట్టి వైద్య నిపుణుల సేవలు పౌరులందరికి అందుబాటుగాను మరియు అందజేయదగినవిగాను చేయు న్యాయోచితమైన మరియు సార్వత్రిక ఆరోగ్య సంరక్షణను పెంపొందించునట్టి; జాతీయ ఆరోగ్య లక్ష్యములను ప్రోత్సహించునట్టి; తమ పనిలో అధునాతన వైద్య పరిశోధనను అవలంభించుటకు మరియు పరిశోధనకు దోహదపడుటకు అట్టి వైద్య నిపుణులను ప్రోత్సహించునట్టి; వైద్య సంస్థల కాలానుగుణమైన మరియు పారదర్శక మదింపు ఉద్దేశమును కలిగియుండి భారతదేశము కొరకు భారతీయ వైద్య విధాన వైద్య రిజిష్టరు నిర్వహణకు వీలు కల్పించి మరియు వైద్య సేవలకు చెందిన అన్ని అంశాలలో ఉన్నతమైన నైతిక ప్రమాణములను అమలు చేయునట్టి; మారుతున్న అవసరములకు అనుకూలముగా చేయుటకు సరళముగా ఉండునట్టి మరియు ఒక ప్రభావకమైన వ్యధ నివారక యంత్రాంగమును కలిగియుండినట్టి ఒక వైద్య విద్యా విధానము కొరకు మరియు అందుకు సంబంధించిన లేదా దానికి ఆనుషంగికమైన విషయముల కొరకు నిబంధించుటకైన చట్టము.**

భారత గణరాజ్యపు డెబ్బది ఒకటవ సంవత్సరంలో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది.

### అధ్యాయము – I

### ప్రారంభిక

సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను చట్టము, 2020 అని పేర్కొనవచ్చును.

(2) ఇది భారతదేశమంతటికి విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా అధికారిక రాజపత్రములో నియతము చేయునట్టి [1]తేదీన అమలులోనికి వచ్చును.

---

1. 7 అక్టోబరు, 2020 - 7-10-2020 తేదీనగల అధిసూచన నెం.ఎస్.ఓ.3483(ఇ) ద్వారా 3,4,5,6,8,11,18,19,20,21,54 మరియు 55 పరిచ్ఛేదములు, భారత రాజపత్రము, అసాధారణ, భాగము-II, పరిచ్ఛేదము 3(ii) చూడుము.
11 జూన్,2021- (మిగిలిన అన్ని నిబంధనలు) 11-06-2021 తేదీన గల అధిసూచన నెం.ఎస్.ఓ.2278(ఈ) ద్వారా. భారతరాజపత్రము, అసాధారణ, భాగము-II, పరిచ్ఛేదము 3(ii) చూడుము.

అయితే, ఈ చట్టపు వేరువేరు నిబంధనలకు వేరువేరు తేదీలను నియతము చేయవచ్చును మరియు ఈ చట్టము ప్రారంభమునకు ఏదేని అట్టి నిబంధనకు గల ఏదేని నిర్దేశమును, ఆ నిబంధన అమలులోనికి వచ్చుటకు గల నిర్దేశముగా అన్వయించుకొనవలెను.

2. ఈ చట్టములో, సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,- నిర్వచనములు.

(ఎ) "స్వయంపాలక బోర్డు" అనగా 18వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన ఏదేని ఒక స్వయంపాలక బోర్డు అని అర్థము;

(బి) "ఆయుర్వేద బోర్డు" అనగా 18వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన బోర్డు అని అర్థము;

(సి) "భారతీయ వైద్య విధానము నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు" అనగా 18వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన బోర్డు అని అర్థము;

(డి) "యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు" అనగా 18వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన బోర్డు అని అర్థము;

(ఇ) "ఛైర్‌పర్సన్" అనగా 5వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను ఛైర్‌పర్సన్ అని అర్థము;

(ఎఫ్) "కమీషను" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను అని అర్థము;

(జి) "మండలి" అనగా 11వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన భారతీయ వైద్య విధాన సలహా మండలి అని అర్థము;

(హెచ్) "భారతీయ వైద్య విధానము" అనగా కమీషను ఆయా సమయములలో కేంద్ర ప్రభుత్వమును సంప్రదించి అధిసూచన ద్వారా ప్రఖ్యానము చేయునట్టి ఆధునిక పురోగమనములు, వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి ద్వారా అదనముగా చేర్చబడిన అష్టాంగ ఆయుర్వేద, యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా వైద్య విధానములు అని అర్థము;

(ఐ) "లైసెన్సు" అనగా 33వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏదేని భారతీయ వైద్య విధానమును ప్రాక్టీసు చేయుటకు మంజూరు చేసిన లైసెన్సు అని అర్థము;

(జె) "భారతీయ వైద్య విధానము కొరకు వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు" అనగా 18వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన బోర్డు అని అర్థము;

(కె) "వైద్య సంస్థ" అనగా భారతీయ వైద్య విధానములో డిగ్రీలు, డిప్లొమాలు లేదా లైసెన్సులను మంజూరుచేయు భారతదేశము లోపల లేదా వెలుపల ఉన్నట్టి ఏదేని సంస్థ అని అర్థము మరియు ఈ పదబంధ పరిధిలో అనుబంధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయములుగా భావించబడు సంస్థలు చేరియుండును;

(ఎల్) "సభ్యుడు" అనగా 4వ పరిచ్ఛేదములో పేర్కొనినట్టి కమీషను సభ్యుడు అని అర్థము మరియు ఈ పదపరిధిలో దాని యొక్క ఛైర్‌పర్సన్ చేరియుండును;

(ఎమ్) "జాతీయ రిజిష్టరు" అనగా 32వ పరిచ్ఛేదము క్రింద భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డుచే నిర్వహించబడిన భారతీయ వైద్య విధాన జాతీయ వైద్య రిజిష్టరు అని అర్థము;

(ఎన్) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము మరియు "అధిసూచించు" అను పదమును తదనుసారముగా అన్వయించుకొనవలెను;

(ఓ) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(పి) "అధ్యక్షుడు" అనగా 20వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన స్వయం ప్రతిపత్తి గల బోర్డు యొక్క అధ్యక్షుడు అని అర్థము;

(క్యు) "వినియమములు" అనగా ఈ చట్టము క్రింద కమీషనుచే చేయబడిన వినియమము అని అర్థము;

(ఆర్) "రాజ్య వైద్య మండలి" అనగా రాజ్యము లేదా సంఘ రాజ్య క్షేత్రములో భారతీయ వైద్య విధాన ప్రాక్టీషనర్ల ప్రాక్టీసు మరియు రిజిస్ట్రేషనును క్రమబద్ధం చేయుటకు ఏదేని రాజ్యము లేదా సంఘ రాజ్య క్షేత్రములో ప్రస్తుతము అమలులో ఉన్న ఏదేని శాసనము క్రింద ఏర్పాటు చేయబడిన భారతీయ వైద్య విధానమునకు చెందిన రాజ్య వైద్య మండలి అని అర్థము;

(ఎస్) "రాజ్య రిజిష్టరు" అనగా భారతీయ వైద్య విధాన ప్రాక్టీషనర్ల రిజిస్ట్రేషను కొరకు ఏదేని రాజ్యము లేదా సంఘ రాజ్య క్షేత్రములో ప్రస్తుతము అమలులో ఉన్నట్టి ఏదేని శాసనము క్రింద నిర్వహించబడిన భారతీయ వైద్య విధాన రాజ్య రిజిష్టరు అని అర్థము;

(టి) "విశ్వవిద్యాలయము" అను పదము, విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషను చట్టము, 1956 (1956లోని 3వది)లోని 2వ పరిచ్ఛేదపు, ఖండము (ఎఫ్)లో దానికి ఒసగబడిన అదే అర్థమును కలిగి ఉండవలెను మరియు ఈ పద పరిధిలో వైద్య విశ్వవిద్యాలయము చేరియుండును.

## అధ్యాయము - II

## భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను

భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను ఏర్పాటు.

3. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టము క్రింద ఒసగబడిన అధికారములను వినియోగించుటకు మరియు అప్పగించిన కృత్యములను నిర్వర్తించుటకుగాను భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను అనబడు ఒక కమీషన్‌ను అధిసూచన ద్వారా ఏర్పాటు చేయవలెను.

(2) సదరు కమీషను, ఈ చట్టములోని నిబంధనలకు అధ్యధీనమై చర, స్థిరాస్తులు రెండింటినీ ఆర్జించుటకు, కలిగియుండుటకు మరియు అమ్మివేయుటకు మరియు కరారు చేసుకొనుటకు అధికారముతో శాశ్వత ఉత్తరాధికారమును మరియు సామాన్య మొహరును కలిగియుండి పైన పేర్కొనబడిన పేరు ద్వారా ఒక నిగమిత సంస్థ అయి ఉండవలెను మరియు సదరు పేరుతో అది దావాలు వేయవచ్చును మరియు దానిపై దావాలు వేయబడవచ్చును.

(3) కమీషను ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీలో ఉండవలెను.

4. (1) కమీషను ఈ క్రింది వ్యక్తులతో కూడియుండవలెను, వారెవరనగా:- కమీషను ఏర్పాటు.

(ఎ) ఒక ఛైర్‌పర్సన్;

(బి) పదిహేను మంది పదవీ రీత్యా సభ్యులు; మరియు

(సి) ఇరవైమూడు మంది పాక్షిక కాల సభ్యులు.

(2) ఛైర్‌పర్సన్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయము నుండి భారతీయ వైద్య విధానమునకు చెందిన ఏదేని విభాగములో పోస్టు గ్రాడ్యుయేటు డిగ్రీ కలిగియుండి మరియు ఆరోగ్య సంరక్షణ డెలివరీ, ఎదుగుదల మరియు భారతీయ వైద్య విధానము లేక దాని విద్యాభివృద్ధి అంశములో నాయకుడిగా కనీసము పది సంవత్సరముల అనుభవముతో, భారతీయ వైద్య విధానములోని ఏదేని రంగములో ఇరువది సంవత్సరములకు తక్కువకాని అనుభవమును కలిగియుండి విశిష్ట ప్రతిభ, నిరూపిత పరిపాలక సామర్థ్యమును మరియు చిత్తశుద్ధిని కలిగియుండవలెను.

(3) ఈ క్రింది వ్యక్తులు పదవీరీత్యా కమీషను సభ్యులుగా కేంద్ర ప్రభుత్వముచే నియమించబడవలెను, వారెవరనగా:-

(ఎ) ఆయుర్వేద బోర్డు అధ్యక్షుడు;

(బి) యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు అధ్యక్షుడు;

(సి) భారతీయ వైద్య విధానము కొరకు వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు అధ్యక్షుడు;

(డి) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు అధ్యక్షుడు;

(ఇ) ఆయుష్ మంత్రిత్వ శాఖలో ఆయుర్వేద విభాగమునకు ఇన్‌ఛార్జీగా ఉన్న భారత ప్రభుత్వ సలహాదారు (ఆయుర్వేద) లేదా సంయుక్త కార్యదర్శి మరియు యునాని విభాగమునకు ఇన్‌ఛార్జీగా ఉన్న భారత ప్రభుత్వ సలహాదారు (యునాని) లేదా సంయుక్త కార్యదర్శి;

(ఎఫ్) ఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ డైరెక్టరు;

(జి) కొత్త ఢిల్లీలోని ఆయుర్వేద విజ్ఞాన శాస్త్రముల పరిశోధన కేంద్ర మండలి డైరెక్టరు జనరలు;

(హెచ్) కొత్త ఢిల్లీలోని యునాని వైద్య పరిశోధన కేంద్ర మండలి డైరెక్టరు జనరలు;

(ఐ) చెన్నైలోని సిద్ధ పరిశోధన కేంద్ర మండలి డైరెక్టరు జనరలు;

(జె) చెన్నైలోని జాతీయ సిద్ధ సంస్థ డైరెక్టరు;

(కె) బెంగళూరులోని జాతీయ యునాని సంస్థ డైరెక్టరు;

(ఎల్) షిల్లాంగ్‌లోని ఆయుర్వేద మరియు హోమియోపతి ఈశాన్య సంస్థ డైరెక్టరు;

(ఎమ్) జామ్‌నగర్‌లోని ఆయుర్వేద పోస్టు గ్రాడ్యుయేట్ బోధనా మరియు పరిశోధనా సంస్థ డైరెక్టరు; మరియు

(ఎన్) జైపూర్‌లోని జాతీయ ఆయుర్వేద సంస్థ డైరెక్టరు;

(4) ఈ క్రింది వ్యక్తులు కమీషను పాక్షిక కాల సభ్యులుగా కేంద్ర ప్రభుత్వముచే నియమించబడవలెను, వారెవరనగా:-

(ఎ) భారతీయ వైద్య విధానము, సంస్కృతము, ఉర్దూ, తమిళము, నిర్వహణ, న్యాయశాస్త్రము, ఆరోగ్య పరిశోధనా, శాస్త్ర సాంకేతిక విజ్ఞానము మరియు ఆర్థిక శాస్త్ర విభాగములు వేటిలోనైన ప్రత్యేక పరిజ్ఞానము మరియు వృత్తిపరమైన అనుభవము కలిగియుండి సామర్థ్యము, చిత్తశుద్ధి మరియు స్థాయిగల వ్యక్తుల నుండి నియమించవలసి ఉన్న నలుగురు సభ్యులు;

(బి) విహితపరచబడునట్టి రీతిలో రెండు సంవత్సరముల కాలావధి పాటు భారతీయ వైద్య విధాన సలహా మండలిలో రాజ్యములు మరియు సంఘరాజ్య క్షేత్రముల యొక్క నామనిర్దేశితుల నుండి వంతులవారీ ప్రాతిపదికపై నియమించబడవలసి ఉన్న పది మంది సభ్యులు;

(సి) విహితపరచబడునట్టి రీతిలో రెండు సంవత్సరముల కాలావధి పాటు భారతీయ వైద్య విధాన సలహా మండలిలో, 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లోని ఖండము (డి) క్రింద రాజ్యములు మరియు సంఘరాజ్య క్షేత్రముల యొక్క నామనిర్దేశితులలో నుండి నియమించబడవలసి ఉన్న ఆయుర్వేద విభాగం నుండి ఆరుగురు సభ్యులు, సిద్ధ, యునాని మరియు సోవా-రిగ్పా విభాగముల ఒక్కొక్క దాని నుండి ఒక సభ్యుడు:

అయితే, ఏ సభ్యుడు తనంత తానుగా లేదా అతని కుటుంబ సభ్యుల ద్వారా ప్రత్యక్షముగా లేదా పరోక్షముగా ఈ చట్టము క్రింద నియంత్రించబడిన ప్రైవేటు లేదా ప్రభుత్వేతర వైద్య సంస్థ యొక్క నిర్వహణ నికాయముతో ఎటువంటి వ్యవహారములను సొంతముగా కలిగియుండరాదు లేదా దానితో సహ సంబంధమును కలిగియుండరాదు.

**విశదీకరణ:** ఈ పరిచ్ఛేదము మరియు 19వ పరిచ్ఛేదము నిమిత్తము, పదము "నాయకుడు" అనగా విభాగ అధిపతి లేదా సంస్థ అధిపతి అని అర్థము.

చైర్‌పర్సన్ మరియు సభ్యుల నియామకము కొరకు సెర్చి కమిటీ.

5. (1) కేంద్ర ప్రభుత్వము, ఈ క్రింది వారితో కూడియున్న సెర్చి కమిటీ సిఫారసులపై 4వ పరిచ్ఛేదములో పేర్కొనిన చైర్‌పర్సన్‌ను మరియు 20వ పరిచ్ఛేదములో పేర్కొనిన స్వయంపాలక బోర్డు అధ్యక్షుడిని నియమించవలెను-

(ఎ) క్యాబినెట్ కార్యదర్శి - చైర్‌పర్సన్;

(బి) భారతీయ వైద్య విధాన రంగములో దేనిలోనైనా ఉత్కృష్టమైన అర్హతలు మరియు ఇరువది అయిదు సంవత్సరములకు తక్కువగాని అనుభవమును కలిగివుండి, కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు ఇద్దరు నిపుణులు - సభ్యులు;

(సి) విహితపరచబడునట్టి రీతిలో 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (సి)లో పేర్కొన్నట్టి సభ్యులలో నుండి కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు ఒక నిపుణుడు - సభ్యుడు;

(డి) సంస్కృతము, ఉర్దూ, తమిళము, ఆరోగ్య పరిశోధనా, నిర్వహణ, న్యాయశాస్త్రము, ఆర్థిక శాస్త్రము లేదా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగములో ఉత్కృష్టమైన అర్హతలను మరియు ఇరువది అయిదు సంవత్సరములకు తక్కువకాని అనుభవమును కలిగివుండి, కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు ఒక వ్యక్తి - సభ్యుడు;

(ఇ) కన్వీనరుగా ఉండునట్టి ఆయుష్ మంత్రిత్వశాఖ ఇన్‌ఛార్జీగా ఉన్న భారత ప్రభుత్వ కార్యదర్శి - సభ్యుడు:

అయితే, 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (ఎ)లో పేర్కొనినట్టి కమీషను పాక్షిక కాల సభ్యులు 8వ పరిచ్ఛేదములో పేర్కొన్నట్టి కార్యదర్శి మరియు 20వ పరిచ్ఛేదములో పేర్కొన్నట్టి స్వయంపాలక బోర్డుల యొక్క ఇతర సభ్యుల ఎంపిక కొరకు సెర్చి కమిటీ (బి) నుండి (డి) వరకు గల ఖండములలో నిర్దిష్టపరచిన సభ్యులను మరియు కన్వీనరు-సభ్యుడిగా ఆయుష్ మంత్రిత్వ శాఖలో భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిని కలిగియుండవలెను మరియు ఆయుష్ మంత్రిత్వశాఖ ఇన్‌ఛార్జీగా ఉండిన భారత ప్రభుత్వ కార్యదర్శి దానికి అధ్యక్షత వహించవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని మరణము, రాజీనామా లేదా తొలగింపు కారణముతో సహా ఏదేని కారణముచేత ఖాళీ ఏర్పడిన తేదీ నుండి ఒక మాసములోగా లేదా ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని కాలావధి ముగియుటకు ముందు మూడు మాసములలోగా అట్టి ఖాళీని భర్తీ చేయుటకు సెర్చి కమిటీకి నిర్దేశము చేయవలెను.

(3) సెర్చి కమిటీ దానికి నిర్దేశించిన ప్రతియొక ఖాళీ కొరకు కనీసం ముగ్గురు పేర్లతో ఒక ప్యానెల్‌ను సిఫారసు చేయవలెను.

(4) కమీషను యొక్క ఛైర్‌పర్సన్ లేదా సభ్యునిగా నియామకము కొరకు ఎవరేని వ్యక్తిని సిఫారసు చేయుటకు ముందుగా సెర్చి కమిటీ, అట్టి ఛైర్‌పర్సన్ లేదా సభ్యునిగా అతని కృత్యములకు ప్రతికూలముగా పరిణమింప చేయునట్టి ఏదేని విత్తీయ లేదా ఇతర హితమును అతను కలిగియుండలేదని, తనంతతానుగా సంతృప్తిచెందవలెను.

(5) సెర్చి కమిటీలో సభ్యుని ఏదేని ఖాళీ లేదా సభ్యుడు హాజరు కాకపోవుట కారణము మాత్రముననే ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని ఏ నియామకము శాసనమాన్యతను కోల్పోదు.

(6) ఉప-పరిచ్ఛేదములు (2) నుండి (5)లోని నిబంధనలకు అధ్యధీనమై సెర్చి కమిటీ, తన సొంత కార్యవిధానమును క్రమబద్ధం చేసుకొనవచ్చును.

చైర్‌పర్సన్ మరియు సభ్యుల పదవీకాలము మరియు సేవా నిబంధనలు.

6. (1) చైర్‌పర్సన్ మరియు సభ్యులు (పదవీరీత్యా సభ్యులు కాకుండా) మరియు 4వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4)లోని (బి) మరియు (సి) ఖండముల క్రింద నియమించబడిన సభ్యులు నాలుగు సంవత్సరములకు మించని కాలావధిపాటు పదవిని కలిగియుందురు మరియు ఏదేని పొడిగింపు లేదా పునర్నియామకమునకు అర్హతను కలిగియుండరు:

అయితే, అట్టి వ్యక్తి డెబ్బది సంవత్సరముల వయస్సు పూర్తయిన తరువాత పదవిని కోల్పోవలెను.

(2) పదవీ రీత్యా సభ్యుని పదవి కాలావధి, అతను ఏ పదవీ రీత్యా సభ్యుడిగా ఉన్నాడో, అట్టి పదవిలో ఉన్నంత కాలము కొనసాగవలెను.

(3) పదవీ రీత్యా సభ్యుడుకాని ఒక సభ్యుడు మూడు క్రమానుగత సాధారణ కమీషను సమావేశములకు గైరు హాజరయినపుడు మరియు అట్టి గైరు హాజరుకు ఆపాదించదగు ఏదేని మాన్యతగల కారణము లేదని కమీషను భావించినపుడు, అట్టి సభ్యుడు పదవిని ఖాళీ చేసినట్లుగా భావించబడవలెను.

(4) చైర్‌పర్సన్ మరియు పదవీ రీత్యా సభ్యుడు కాని సభ్యునికి చెల్లించదగు జీతము మరియు బత్తెములు మరియు ఇతర నిబంధనలు మరియు షరతులు విహితపరచబడునట్లుగా ఉండవలెను.

(5) చైర్‌పర్సన్ లేదా సభ్యుడు,-

(ఎ) కేంద్ర ప్రభుత్వమునకు మూడు మాసములకు తక్కువకాని వ్రాతపూర్వకమైన నోటీసును ఇచ్చుట ద్వారా అతనిని పదవి నుండి తొలగింపవచ్చును; లేదా

(బి) 7వ పరిచ్ఛేదములోని నిబంధనల ననుసరించి అతను తన పదవి నుండి తొలగింపబడవచ్చును:

అయితే, అట్టి వ్యక్తి మూడు మాసములకు ముందుగానే విధుల నుండి విముక్తి కల్పించబడవచ్చును లేదా కేంద్ర ప్రభుత్వము అట్లు నిర్ణయించినయెడల, ఉత్తరాధికారి నియమించబడు వరకు మూడు మాసములకు పైబడి కొనసాగుటకు అతను అనుమతించబడవచ్చును.

(6) కమీషను యొక్క చైర్‌పర్సన్ మరియు ప్రతి ఒక సభ్యుడు, అతను పదవిని స్వీకరించు సమయములో మరియు పదవిని త్యజించు సమయములో తన ఆస్తులు మరియు అప్పులకు సంబంధించి విహితపరచబడునట్టి ప్రరూపము మరియు రీతిలో ప్రఖ్యానము చేయవలెను మరియు అతని వృత్తిపరమైన మరియు వ్యాపారపరమైన నిమగ్నము లేదా జోక్యమును కూడా ప్రఖ్యానించవలెను మరియు అట్టి ప్రఖ్యానము కమీషను వెబ్‌సైట్‌లో ప్రచురించబడవలెను.

(7) ఆ విధంగా పదవి నుండి వైదొలుగుతున్న ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు, భారతీయ వైద్య విధానమునకు చెందిన ఏదేని ప్రైవేటు వైద్య సంస్థలో లేదా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అట్టి ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు వ్యవహరించినట్టి విషయములో ఒక సంప్రదింపుదారుగా లేదా ఒక నిపుణునిగా ఉండుటతో సహా ఏదేని హోదాలో ఏదేని ఉపాధిని, అట్టి పదవిని త్యజించిన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధిపాటు స్వీకరించరాదు:

అయితే, ఇందులో ఉన్నది ఏదీ, కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వముచే నియంత్రించబడిన లేదా నిర్వహించబడిన భారతీయ వైద్య విధానమునకు చెందిన వైద్య సంస్థతో సహా ఒక నికాయము లేదా సంస్థలో ఉపాధిని స్వీకరించుట నుండి అట్టి వ్యక్తిని నివారించదని అన్వయించకొనబడవలెను.

(8) ఉప-పరిచ్ఛేదము (7)లో ఉన్నదేదీ అట్టి ఛైర్‌పర్సన్ లేదా సభ్యునిచే ఎవరి విషయం వ్యవహరించబడినదో అట్టి భారతీయ వైద్య విధానమునకు చెందిన ఏదేని ప్రైవేటు వైద్య సంస్థలో ఒక సంప్రదింపుదారుగా లేదా ఒక నిపుణునిగా ఉండుటతో సహా ఏదేని హోదాలో ఏదేని ఉపాధిని స్వీకరించుటకు ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడిని అనుమతించుట నుండి కేంద్ర ప్రభుత్వమును నివారించదు.

7. (1) కేంద్ర ప్రభుత్వము ఈ క్రింది సందర్భములలో ఛైర్‌పర్సన్ లేదా ఎవరేని ఇతర సభ్యుడిని ఉత్తరువు ద్వారా పదవి నుండి తొలగించవచ్చును,- కమీషను యొక్క ఛైర్‌పర్సన్ లేదా సభ్యులను తొలగించుట.

(ఎ) దివాలాదారునిగా న్యాయ నిర్ణయము చేయబడినచో;

(బి) కేంద్ర ప్రభుత్వ అభిప్రాయములో నీతిబాహ్యతతో కూడియున్న కారణంగా; ఏదేని అపరాధమునకు దోషస్థాపితుడైనచో; లేదా

(సి) ఛైర్-పర్సన్ లేదా సభ్యుడిగా వ్యవహరించుటకు శారీరకంగా గాని లేదా మానసికంగా గాని అసమర్థుడైనచో; లేదా

(డి) మతిస్థిమ్మితం లేనివాడై మరియు సమర్థ న్యాయస్థానంచే ఆ విధముగా ప్రఖ్యానము చేయబడినయెడల; లేదా

(ఇ) సభ్యునిగా అతని కృత్యములకు ప్రతికూలముగా పరిణమించదగు అట్టి విత్తీయ లేదా ఇతర హితమును ఆర్జించినచో; లేదా

(ఎఫ్) ప్రజా హితమునకు భంగకరముగా పదవిలో కొనసాగుటకు అతని పదవిని అట్లు దుర్వినియోగపరచినచో;

(2) అట్టి విషయములో ఆకర్ణింపబడుటకు తగిన అవకాశమును ఈయబడిననే తప్ప, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండములు (ఇ) మరియు (ఎఫ్) క్రింద ఏ సభ్యుడు తొలగింపబడరాదు.

కమీషను కార్యదర్శి, నిపుణులు, వృత్తిపరంగా సమర్థులైన వ్యక్తులు, అధికారులు మరియు ఉద్యోగుల నియామకము.

8. (1) 5వ పరిచ్ఛేదములోని నిబంధనల ననుసరించి, కేంద్ర ప్రభుత్వముచే నియమించబడునట్టి కార్యదర్శి అధిపతిగా ఉండునట్టి కమీషను కొరకు ఒక సచివాలయము ఉండవలెను.

(2) కమీషను కార్యదర్శి, విహితపరచబడునట్టి అర్హతలు మరియు అనుభవమును కలిగియుండి, రుజువైన పరిపాలక సామర్థ్యం మరియు చిత్తశుద్ధిగల వ్యక్తియై ఉండవలెను.

(3) కార్యదర్శి నాలుగు సంవత్సరముల కాలావధిపాటు కేంద్ర ప్రభుత్వముచే నియమించబడవలెను మరియు అతను ఏదేని పొడిగింపు లేక పునర్నియామకమునకు అర్హత కలిగియుండరు.

(4) కార్యదర్శి కమీషనుచే అతనికి అప్పగించబడినట్టి మరియు ఈ చట్టము క్రింద చేయబడిన వినియమముల ద్వారా నిర్ధిష్టపరచబడునట్టి కమీషను కృత్యములను నిర్వర్తించవలెను.

(5) కమీషను, ఈ చట్టము క్రింద తన కృత్యములను సమర్ధవంతముగా నిర్వర్తించుట కొరకు కేంద్ర ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడిన పదవులకు అది అవసరమని భావించినట్టి అధికారులు మరియు ఇతర ఉద్యోగులను నియమించవచ్చును.

(6) కమీషను యొక్క కార్యదర్శి, అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీతము మరియు బత్తెములు మరియు సర్వీసు నిబంధనలు మరియు షరతులు విహితపరచబడునట్లుగా ఉండవలెను.

(7) కమీషను, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించుటలో కమీషనుకు సహాయపడుటకై వినియమముల ద్వారా నిర్ధిష్టపరచబడిన కార్యవిధానము ననుసరించి, అట్టి సంఖ్యలో భారతీయ వైద్య విధానములో ప్రత్యేక పరిజ్ఞానమును మరియు భారతీయ వైద్య విధానములో వైద్య విద్యతో సహా ప్రజారోగ్యము, నిర్వహణ, ఆర్థిక శాస్త్రము, గుర్తింపు, ఓర్పుగల వాదన, ఆరోగ్య పరిశోధన, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలన, విత్తీయ, లెక్కలు లేదా న్యాయ శాస్త్ర రంగములలో అనుభవము కలిగియుండి చిత్తశుద్ధి మరియు ఉత్కృష్టమైన సామర్థ్యము గల నిపుణులు మరియు వృత్తిపరంగా సమర్థులైన వారిని నియోగించవచ్చును.

కమీషను సమావేశము.

9. (1) కమీషను, ఛైర్‌పర్సన్‌చే నియతము చేయునట్టి సమయములోనూ మరియు ప్రదేశములోనూ ప్రతి మూడు మాసముల కొకసారి సమావేశము కావలెను.

(2) కమీషను సమావేశమునకు ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహించవలెను మరియు ఏదేని కారణముచేత ఛైర్‌పర్సన్ కమీషను సమావేశమునకు హాజరు కాలేకపోయినచో, ఛైర్-పర్సన్‌చే నామనిర్దేశము చేయబడిన స్వయంపాలక బోర్డుల అధ్యక్షుడుగా ఉన్న ఎవరేని సభ్యుడు సమావేశమునకు అధ్యక్షత వహించవలెను.

(3) కమీషను సమావేశములో అనుసరించదగు కార్యవిధానము వినియమములచే ఇతర విధముగా నిబంధించిననే తప్ప, ఛైర్‌పర్సన్‌తో సహా, కమీషను సభ్యుల మొత్తము సంఖ్యలో సగం మంది సభ్యులతో కోరం ఏర్పాటు కావలెను మరియు కమీషను నిర్ణయములన్నీ హాజరైన మెజారిటీ సభ్యులచే తీసుకొనబడవలెను మరియు ఓట్లు సమానముగా వచ్చినపుడు, ఛైర్‌పర్సన్ లేదా అతను హాజరులో లేనపుడు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద నామనిర్దేశము చేయబడిన స్వయంపాలక బోర్డు అధ్యక్షుడు నిర్ణాయక ఓటును కలిగియుండవలెను.

(4) కమీషను సాధారణ అధీక్షణ, నిర్దేశము మరియు పరిపాలక నియంత్రణ ఛైర్‌పర్సన్‌కు నిహితమైయుండును.

(5) కమీషను యొక్క ఏదేని చర్య లేదా శాసనిక చర్య,-

(ఎ) అందులో ఏదేని ఖాళీ ఉన్నదను లేదా దాని ఏర్పాటులో ఏదేని లోపము ఉన్నదను; లేక

(బి) ఛైర్‌పర్సన్‌గా లేదా ఒక సభ్యునిగా వ్యవహరించుచున్న వ్యక్తి నియామకములో ఏదేని లోపమున్నదను

కారణముపై మాత్రమే శాసనమాన్యతను కోల్పోదు.

(6) 31వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద చేసిన నిర్ణయము తప్ప, కమీషను యొక్క ఏదేని నిర్ణయముచే వ్యధితుడైన వ్యక్తి ఎవరైనా అట్టి నిర్ణయమును తెలియచేసిన పదిహేను దినములలోగా, అట్టి నిర్ణయముపై కేంద్ర ప్రభుత్వమునకు అపీలు చేసుకొనవచ్చును.

10. (1) కమీషను, ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా,- కమీషను అధికారములు మరియు కృత్యములు.

(ఎ) భారతీయ వైద్య విధానములో అధిక నాణ్యత మరియు అధిక ప్రమాణములను నిర్వహించుటకై విధానములను నిర్ణయించుట మరియు ఇందు నిమిత్తము అవసరమయిన నియమములను చేయుట;

(బి) వైద్య సంస్థలు, వైద్య పరిశోధనలు మరియు వైద్య వృత్తి నిపుణులను నియంత్రించుటకు విధానములను నిర్ణయించుట;

(సి) ఆరోగ్యము మరియు ఆరోగ్య సంరక్షక మౌలిక సదుపాయముల కొరకు మానవ వనరులతో సహా ఆరోగ్య సంరక్షణలో అవసరమయిన వాటిని మదింపు చేయుట మరియు అట్టి అవసరములను తీర్చుట కొరకు ఒక రోడ్ మ్యాపును అభివృద్ధి పరచుట;

(డి) కమీషను, స్వయంపాలక బోర్డులు మరియు భారతీయ వైద్య విధానమునకు చెందిన రాష్ట్ర వైద్య మండళ్ళు సరి అయిన విధముగా పనిచేయుటకై, అవసరమగునట్టి వినియమములను చేయుట ద్వారా మార్గదర్శకములను రూపొందించుట మరియు విధానములను నిర్ణయించుట;

(ఇ) స్వయంపాలక బోర్డులలో సమన్వయము ఉండేటట్లు చూచుట;

(ఎఫ్) ఈ చట్టము క్రింద సమర్థవంతముగా పనిచేయుటకు గాను, ఈ చట్టము క్రింద రూపొందించిన మార్గదర్శకములు మరియు వినియమములను భారతీయ వైద్య విధానమునకు చెందిన రాజ్య వైద్య మండళ్ళు పాటించేటట్లు చూచుటకై అవసరమగునట్టి చర్యలను తీసుకొనుట;

(జి) స్వయంపాలక బోర్డుల నిర్ణయములకు సంబంధించి అపిలేటు అధికారుల పరిధిని వినియోగించుట;

(హెచ్) ప్రాక్టీషనర్లు, సంరక్షణ కల్పించే సమయములో వైద్య వృత్తిలో వృత్తిపరమైన నైతిక విలువలు పాటించేటట్లు మరియు నైతిక ప్రవర్తనను పెంపొందించేటట్లు చూచుట;

(ఐ) ఈ చట్టపు నిబంధన క్రింద నియంత్రించబడిన ప్రైవేటు వైద్య సంస్థలు మరియు డీమ్డ్ విశ్వవిద్యాలయములో యాభై శాతం సీట్లకు సంబంధించి ఫీజులు మరియు అన్ని ఇతర ఛార్జీలను నిర్ధారించుటకై మార్గదర్శకాలను రూపొందించుట;

(జె) విహితపరచబడునట్లుగా అట్టి ఇతర అధికారములను వినియోగించుట మరియు అట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుట.

(2) కమీషను యొక్క అన్ని ఉత్తరువులు మరియు నిర్ణయములు కార్యదర్శి సంతకము ద్వారా అధిప్రమాణీకరించబడవలెను మరియు కమీషను అది అవసరమని భావించినట్టి పరిపాలక మరియు విత్తీయ విషయములపై తన అధికారములను కార్యదర్శికి ప్రత్యాయోజనము చేయవచ్చును.

(3) కమీషను, ఉప-కమిటీలను ఏర్పాటు చేయవచ్చును మరియు నిర్దిష్ట పనులను పూర్తి చేయుటకుగాను వాటికి వీలు కల్పించుటకై అవసరమగునట్టి తన అధికారములను వాటికి ప్రత్యాయోజనము చేయవచ్చును.

## అధ్యాయము - III

## భారతీయ వైద్య విధానము కొరకు సలహా మండలి

భారతీయ వైద్య విధానము కొరకు సలహా మండలి ఏర్పాటు మరియు స్వరూపము.

11. (1) కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా భారతీయ వైద్య విధానము కొరకు సలహా మండలి అనబడు ఒక సలహా నికాయమును ఏర్పాటు చేయవలెను.

(2) మండలి ఒక ఛైర్‌పర్సన్‌ను మరియు ఈ క్రింది సభ్యులను కలిగియుండును, వారెవరనగా,-

(ఎ) కమీషను ఛైర్‌పర్సన్ మండలికి పదవీరీత్యా ఛైర్‌పర్సన్‌గా ఉండవలెను;

(బి) కమీషను యొక్క ప్రతి సభ్యుడు, మండలిలో పదవీరీత్యా సభ్యునిగా ఉండవలెను;

(సి) ప్రతియొక రాజ్యమునకు ప్రాతినిధ్యము వహించుటకై, రాష్ట్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడి భారతీయ వైద్య విధానములో అర్హతలు కలిగియుండి, ఆ రాజ్యములోని ఒక విద్యాలయమునకు వైస్-ఛాన్స్‌లరుగా ఉండిన ఒక సభ్యుడు మరియు భారతీయ వైద్య విధానములో అర్హతలను కలిగియుండి ఆ సంఘరాజ్య క్షేత్రములోని ఒక విశ్వవిద్యాలయమునకు వైస్-ఛాన్స్‌లరుగా ఉండి, ప్రతి సంఘ రాజ్య క్షేత్రమునకు ప్రాతినిధ్యం వహించుటకై భారత ప్రభుత్వ గృహ వ్యవహారాల మంత్రిత్వశాఖచే నామనిర్దేశము చేయబడు ఒక సభ్యుడు:

అయితే, భారతీయ వైద్య విధానములో అర్హతలను కలిగియున్న వైస్-ఛాన్స్‌లరు లభ్యముగా లేనపుడు, భారతీయ వైద్య విధానములో అర్హతలను కలిగియున్న ఫ్యాకల్టీకి చెందిన డీను లేదా శాఖాధిపతి నామనిర్దేశము చేయబడవలెను;

(డి) భారతీయ వైద్య విధానమునకు చెందిన రాజ్య వైద్య మండలికి ఎన్నుకొనబడిన సభ్యుల నుండి ప్రతి రాజ్యమునకు మరియు ప్రతి సంఘ రాజ్య క్షేత్రమునకు ప్రాతినిధ్యము వహించుటకై ఆ రాజ్య వైద్య మండలిచే నామనిర్దేశము చేయబడు ఒక సభ్యుడు;

(ఇ) విశ్వ విద్యాలయ గ్రాంట్ల కమీషను, ఛైర్మన్;

(ఎఫ్) జాతీయ మదింపు మరియు గుర్తింపు మండలి, డైరెక్టరు;

(జి) భారతీయ సాంకేతిక పరిజ్ఞాన సంస్థలు, భారతీయ సంస్థల నిర్వహణ మరియు భారతీయ విజ్ఞానశాస్త్ర సంస్థలలో డైరెక్టరు పదవిని కలిగియున్న వ్యక్తుల నుండి కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడు నలుగురు సభ్యులు.

భారతీయ వైద్య విధాన సలహా మండలి కృత్యములు.

12. (1) మండలి, రాజ్యములు మరియు సంఘ రాజ్య క్షేత్రములు తమ అభిప్రాయములు మరియు ఆందోళనలను కమీషనుకు ప్రకటించుటకు ప్రాథమిక వేదికగా ఉండవలెను మరియు వైద్య విద్య, శిక్షణ, పరిశోధన మరియు అభివృద్ధికి చెందిన సమగ్ర అజెండా, విధానము మరియు కార్యాచరణను రూపొందించుటలో సహాయపడవలెను.

(2) మండలి, వైద్య విద్య, శిక్షణ, పరిశోధన మరియు అభివృద్ధికి చెందిన కనీస ప్రమాణాలను నిర్ధారించి మరియు నిర్వహించుటకు మరియు వాటి నిర్వహణను సమన్వయ పరచుటకై కమీషనుకు సలహానీయవలెను.

(3) మండలి, వైద్య విద్యకు న్యాయోచితమైన సౌలభ్యాన్ని పెంచుటకై, తీసుకొను చర్యలపై కమీషనుకు సలహానీయవలెను.

భారతీయ వైద్య విధాన సలహా మండలి సమావేశములు.

13. (1) మండలి, ఛైర్‌పర్సన్‌చే నిర్ణయించబడునట్టి సమయము మరియు స్థలములో కనీసము సంవత్సరమునకు రెండుసార్లు సమావేశము కావలెను.

(2) ఛైర్‌పర్సన్ మండలి సమావేశమునకు అధ్యక్షత వహించవలెను మరియు ఏదేని కారణముచేత మండలి సమావేశమునకు ఛైర్‌పర్సన్ హాజరు కాలేకపోయినచో ఛైర్‌పర్సన్‌చే నామనిర్దేశము చేయబడిన అట్టి ఇతర సభ్యుడు సమావేశమునకు అధ్యక్షత వహించవలెను.

(3) కార్యవిధానము వినియమములచే ఇతర విధముగా నిబంధించుననే తప్ప, ఛైర్‌పర్సన్‌తో సహా మండలిలోని సగము మంది సభ్యులు కోరంను ఏర్పాటు చేయవలెను. మరియు హాజరయి, ఓటింగు చేయు మెజారిటీ సభ్యులచే మండలి యొక్క అన్ని చర్యలు నిర్ణయించబడవలెను.

## అధ్యాయము - IV

## జాతీయ పరీక్ష

జాతీయ అర్హతతో సహా ప్రవేశ పరీక్ష.

14. (1) ఈ చట్టము క్రింద నియంత్రించబడిన అన్ని వైద్య సంస్థలలో భారతీయ వైద్య విధానమునకు చెందిన ప్రతి ఒక విభాగములలో అండర్ గ్రాడ్యుయేటు కోర్సులకు ప్రవేశము కొరకు ఒకే విధమైన జాతీయ అర్హతతో సహా ప్రవేశ పరీక్ష ఉండవలెను.

అయితే, జాతీయ అర్హతతో సహా ప్రవేశ పరీక్ష నుండి-

(i) బ్యాచిలర్ ఆఫ్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ కొరకు ప్రీ-టిబ్; మరియు

(ii) బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కొరకు ప్రీ-ఆయుర్వేదలో ప్రవేశము పొందిన విద్యార్థులు మినహాయించబడవలెను.

(2) కమీషను, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ ద్వారా మరియు అట్టి రీతిలో జాతీయ అర్హతతో సహా ప్రవేశ పరీక్షను ఆంగ్లము మరియు అట్టి ఇతర భాషలలో నిర్వహించవలెను.

(3) కమీషను, ఈ చట్టము క్రింద నియంత్రించబడిన అన్ని వైద్య సంస్థలలో ప్రవేశము కొరకు పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థచే ఉమ్మడి కౌన్సిలింగు నిర్వహించు రీతిని వినియమముల ద్వారా నిర్దిష్టపరచవలెను:

అయితే, ఉమ్మడి కౌన్సిలింగ్ ఈ క్రింది వాటికి చెందిన పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థచే నిర్వహించబడవలెను,-

(i) అఖిల భారత సీట్లకు కేంద్ర ప్రభుత్వము; మరియు

(ii) రాజ్య స్థాయిలో మిగిలిన సీట్లకు రాజ్య ప్రభుత్వము.

(4) కమీషను, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద మినహాయించబడిన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు విద్యార్థుల ప్రవేశ రీతి వినియమముల ద్వారా నిర్దిష్టపరచవలెను.

15. (1) జాతీయ నిష్క్రమణ పరీక్ష అనబడే ఒక ఉమ్మడి అంతిమ సంవత్సర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య పరీక్ష, భారతీయ వైద్య విధానమునకు చెందిన సంబంధిత విభాగములలో మెడికల్ ప్రాక్టీషనరుగా ప్రాక్టీసు చేయుటకై లైసెన్సును మంజూరు చేయుట కొరకు మరియు సందర్భాన్నిబట్టి రాజ్య రిజిష్టరు లేదా జాతీయ రిజిష్టరులో నమోదు చేయుట కొరకు నిర్వహించబడవలెను. జాతీయ నిష్క్రమణ పరీక్ష.

(2) కమీషను, వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ ద్వారా మరియు అట్టి రీతిలో భారతీయ వైద్య విధాన జాతీయ నిష్క్రమణ పరీక్షను ఆంగ్లము మరియు అట్టి ఇతర భాషలతో నిర్వహించవలెను.

(3) జాతీయ నిష్క్రమణ పరీక్ష, అధిసూచన ద్వారా కేంద్ర ప్రభుత్వముచే విహితము చేయబడునట్టి తేదీన ఈ చట్టము అమలులోనికి వచ్చిన తేదీ నుండి మూడు సంవత్సరములలోగా అమలులోనికి రావలెను.

(4) విదేశీ వైద్య అర్హతలను కలిగివున్న ఎవరేని వ్యక్తి వినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి రీతిలో భారతీయ వైద్య విధానములో మెడికల్ ప్రాక్టీషనరుగా ప్రాక్టీసు చేయుటకు లైసెన్సును పొందు నిమిత్తము మరియు రాజ్య రిజిష్టరు లేదా జాతీయ రిజిష్టరులో సందర్భాన్నిబట్టి నమోదుచేయుట కొరకు జాతీయ నిష్క్రమణ పరీక్షలో అర్హత పొందవలెను.

16. (1) ఈ చట్టము క్రింద నియంత్రించబడిన అన్ని వైద్య సంస్థలలో భారతీయ వైద్య విధానములోని ప్రతియొక విభాగములో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం కొరకు ఒకే మాదిరి పోస్టు గ్రాడ్యుయేట్ జాతీయ ప్రవేశ పరీక్ష నిర్వహించబడవలెను. పోస్టు గ్రాడ్యుయేట్ జాతీయ ప్రవేశ పరీక్ష.

(2) కమీషను, వినియమముల ద్వారా నిర్ధిష్టపరచబడు రీతిలో మరియు అట్టి పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ ద్వారా ఆంగ్లము మరియు అట్టి ఇతర భాషలలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశము కొరకు జాతీయ ప్రవేశ పరీక్షను నిర్వహించవలెను.

(3) కమీషను, ఈ చట్టము క్రింద నియంత్రించబడిన వైద్య సంస్థలన్నింటిలోని పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లకు ప్రవేశము కొరకు పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థచే ఉమ్మడి కౌన్సిలింగ్‌ను నిర్వహించు రీతిని వినియమముల ద్వారా నిర్ధిష్టపరచవలెను.

17. (1) భారతీయ వైద్య విధానములోని ప్రతి ఒక విభాగములో పోస్టు గ్రాడ్యుయేట్ల కొరకు ఆ విభాగములో బోధనా వృత్తిని చేపట్టవలెనని వాంఛించు వారికి ఆ విభాగములో ప్రత్యేకముగా ఒక జాతీయ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష నిర్వహించబడవలెను. భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష.

(2) కమీషను, వినియమముల ద్వారా నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో, అట్టి పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ ద్వారా భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ ఉపాధ్యాయ అర్హతా పరీక్షను నిర్వహించవలెను.

(3) భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష ఈ చట్టము అమలులోనికి వచ్చిన తేదీ నుండి మూడు సంవత్సరములలోగా కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి తేదీన అమలులోనికి రావలెను:

అయితే, ఈ పరిచ్ఛేదములో ఉన్నదేదీ ఉప-పరిచ్ఛేదము (3) క్రింద అధిసూచించబడిన తేదీకి పూర్వము నియమించబడిన ఉపాధ్యాయులకు వర్తించదు.

## అధ్యాయము - V

## స్వయంపాలక బోర్డులు

స్వయంపాలక బోర్డుల ఏర్పాటు.

18. (1) కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ఈ చట్టము క్రింద అట్టి బోర్డులకు అప్పగించిన కృత్యములను నిర్వర్తించుటకై, కమీషను సమగ్ర పర్యవేక్షణ క్రింద ఈ క్రింది స్వయంపాలక బోర్డులను ఏర్పాటు చేయవలెను, అవేవనగా:-

(ఎ) ఆయుర్వేద బోర్డు;

(బి) యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు;

(సి) భారతీయ వైద్య విధానము కొరకు వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు; మరియు

(డి) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనినట్టి ప్రతియొక బోర్డు, కమీషనుచే చేయబడిన వినియమముల ననుసరించి ఈ చట్టము క్రింద కృత్యములను నిర్వహించునట్టి ఒక స్వయంపాలక నికాయమైయుండవలెను.

స్వయంపాలక బోర్డుల స్వరూపము.

19. (1) స్వయంపాలక బోర్డుల స్వరూపము ఈ క్రింది విధముగా ఉండవలెను:-

(ఎ) ఆయుర్వేద బోర్డు భారతీయ వైద్య, విభాగములోని ఆయుర్వేద విభాగము నుండి ఒక అధ్యక్షుడుని మరియు నలుగురు సభ్యులను కలిగియుండవలెను.

(బి) యునాని, సిద్ధ, సోవా-రిగ్పా బోర్డు, భారతీయ వైద్య విధానములోని యునాని, సిద్ధ, సోవా-రిగ్పా ఒక్కొక్క విభాగము నుండి ఒక అధ్యక్షుడుని మరియు ఇద్దరు సభ్యులను కలిగియుండవలెను.

(సి) భారతీయ వైద్య విధానము కొరకు వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు, ఒక అధ్యక్షుడిని మరియు ఎనిమిది మంది సిబ్బందిని కలిగియుండవలెను:

అయితే, అధ్యక్షుడు మరియు ఎనిమిది మంది సభ్యులలో ఆరుగురు ఒక్కొక్క విభాగమునకు కనీసం ఒక సభ్యుడు ప్రత్యేకముగా ప్రాతినిధ్యము వహించునట్టి రీతిలో భారతీయ వైద్య విధానములోని ఆయుర్వేద, సిద్ధ, సోవా-రిగ్పా మరియు యునాని విభాగముల నుండి ఎంపిక చేయబడవలెను మరియు మిగిలిన ఇద్దరు సభ్యులు అధికారిక గుర్తింపుగల నిపుణులై ఉండవలెను;

(డి) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, ఒక అధ్యక్షుడిని మరియు ఎనిమిది మంది సభ్యులను కలిగివుండవలెను:

అయితే, అధ్యక్షుడు మరియు ఎనిమిది మంది సభ్యులలో ఆరుగురు ఒక్కొక్క విభాగమునకు కనీసం ఒక సభ్యుడు ప్రత్యేకముగా ప్రాతినిధ్యము వహించునట్టి రీతిలో భారతీయ వైద్య విధానములోని ఆయుర్వేద, సిద్ధ, సోవా-రిగ్పా మరియు యునాని విభాగముల నుండి ఎంపిక చేయబడవలెను మరియు మిగిలిన ఇద్దరు సభ్యులు నాణ్యతా హామీ, ప్రజారోగ్యము, న్యాయశాస్త్రము లేదా ఓర్పుగల వాదము వంటి విభాగములలో ఏ విభాగము నుండైనా ఉండవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఎంపిక చేయబడునట్టి స్వయంపాలక బోర్డుల అధ్యక్షుడు మరియు సభ్యుడు, సంబంధిత రంగములలో కనీసము ఏడు సంవత్సరములు నాయకుడిగా ఉండి, పదిహేను సంవత్సరములకు తక్కువకాని అనుభవములో ఒక గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయము నుండి సంబంధిత విభాగములలో పోస్టు-గ్రాడ్యుయేట్ డిగ్రీని కలిగియుండి, ఉత్కృష్టమైన సామర్థ్యము, నిరూపిత పరిపాలక సామర్థ్యము మరియు చిత్తశుద్ధిని కలిగివున్న వ్యక్తులై ఉండవలెను:

అయితే, భారతీయ వైద్య విధానము నుండి అధ్యక్షుడు మరియు సభ్యుని విషయములో నాయకుడిగా ఏడు సంవత్సరములు, భారతీయ వైద్య విధానములోని ఆరోగ్యము ఎదుగుదల మరియు విద్యాభివృద్ధి రంగములలో ఉండవలెను.

అధ్యక్షుడు మరియు సభ్యుల నియామకము కొరకు సెర్చి కమిటీ.

20. కేంద్ర ప్రభుత్వము, దాని క్రింద ఏర్పాటు చేయబడిన సెర్చి కమిటీచే 5వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచిన కార్యవిధానము ననుసరించి చేయబడిన సిఫారసుల ఆధారముగా స్వయంపాలక బోర్డుల అధ్యక్షుడు మరియు సభ్యులను నియమించవలెను.

అధ్యక్షుడు మరియు సభ్యుల పదవీకాలము మరియు సేవా షరతులు.

21. (1) ప్రతి ఒక స్వయంపాలక బోర్డు అధ్యక్షుడు మరియు సభ్యులు నాలుగు సంవత్సరములకు మించని కాలావధిపాటు పదవిని కలిగియుందురు మరియు ఏవిధమైన పొడిగింపు లేదా పునర్నియామకమునకు అర్హత కలిగివుండరు:

అయితే, అట్టి వ్యక్తి డెబ్బది సంవత్సరముల వయస్సు నిండిన తరువాత పదవి నుండి వైదొలగవలెను.

(2) స్వయంపాలక బోర్డుల అధ్యక్షుడు మరియు సభ్యులకు చెల్లించదగు జీతము మరియు బత్తెములు మరియు ఇతర నిబంధనలు మరియు సేవా షరతులు విహితపరచబడునట్లుగా ఉండవలెను.

(3) సేవా నిబంధనలు మరియు షరతులకు సంబంధించి 6వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదములు (3), (5), (6), (7) మరియు (8)లోను మరియు కమీషను యొక్క ఛైర్‌పర్సన్ మరియు సభ్యులను పదవి నుండి తొలగింపుకు సంబంధించి 7వ పరిచ్ఛేదములోను ఉన్నట్టి నిబంధనలు, స్వయంపాలక బోర్డుల యొక్క అధ్యక్షుడు మరియు సభ్యులకు కూడా వర్తింపచేయవలెను.

నిపుణుల సలహా కమిటీలు.

22. (1) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు తప్ప ప్రతి ఒక స్వయంపాలక బోర్డు, ఈ చట్టము క్రింద అట్టి బోర్డుల కృత్యములను సమర్ధవంతముగా నిర్వర్తించుటకు కమీషనుచే ఏర్పాటు చేయబడునట్టి సలహా కమిటీల నిపుణులచే సహాయమందించబడవలెను.

(2) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, ఈ చట్టము క్రింద అట్టి బోర్డుల కృత్యములను సమర్ధవంతముగా నిర్వర్తించుటకు కమీషనుచే ఏర్పాటు చేయబడునట్టి నైతిక విలువల కమిటీల నిపుణులచే సహాయమందించబడవలెను.

స్వయంపాలక బోర్డుల సిబ్బంది.

23. 8వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన నిపుణులు, వృత్తిపరంగా సమర్ధులైనవారు, అధికారులు మరియు ఇతర ఉద్యోగులను కమీషనుచే చేయబడిన వినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి సంఖ్యలో మరియు అట్టి రీతిలో స్వయంపాలక బోర్డులకు అందుబాటులో ఉంచవలెను.

స్వయంపాలక బోర్డుల సమావేశములు, మొదలైనవి.

24. (1) ప్రతియొక స్వయంపాలక బోర్డు ఒక మాసములో కనీసము ఒకసారి అది నియతము చేయు అట్టి సమయము మరియు ప్రదేశములో సమావేశము కావలెను.

(2) ఇందు కోసం చేయబడునట్టి వినియమములకు అధ్యధీనమై స్వయంపాలక బోర్డుల నిర్ణయములన్నీ ఏకాభిప్రాయము ద్వారా చేయబడవలెను మరియు ఏకాభిప్రాయము సాధ్యపడనపుడు అధ్యక్షుడు మరియు సభ్యులు మెజారిటీ ఓట్ల ద్వారా నిర్ణయము చేయబడవలెను.

(3) స్వయంపాలక బోర్డు ఏదేని నిర్ణయముచే వ్యధితుడైన వ్యక్తి అట్టి నిర్ణయము తెలియజేసిన నాటి నుండి ముప్పది దినములలోగా అట్టి నిర్ణయముపై కమీషనుకు అపీలును చేసుకొనవచ్చును.

అధికారముల ప్రత్యాయోజనము.

25. (1) కమీషను, బోర్డు సజావుగా మరియు సమర్ధవంతముగా పనిచేయుటకు వీలు కల్పించుటకై ప్రతియొక స్వయంపాలక బోర్డు అధ్యక్షునికి అన్ని లేక ఏదేని తన పరిపాలక మరియు విత్తీయ అధికారములను ప్రత్యాయోజనము చేయవచ్చును.

(2) స్వయంపాలక బోర్డు అధ్యక్షుడు, తదుపరి ఏవేని అతని అధికారములను సదరు బోర్డు సభ్యుడు లేక అధికారికి ప్రత్యాయోజనము చేయవచ్చును.

స్వయంపాలక బోర్డుల అధికారములు మరియు కృత్యములు.

26. (1) భారతీయ వైద్య విధానమునకు చెందిన ఆయుర్వేద విభాగమునకు సంబంధించి ఆయుర్వేద బోర్డు, మరియు యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా విభాగమునకు సంబంధించి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు వాటి సంబంధిత విభాగముల విషయములో ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) అండర్-గ్రాడ్యుయేట్, పోస్ట్-గ్రాడ్యుయేట్ మరియు సూపర్ స్పెషాలిటీ స్థాయిలలో విద్యా ప్రమాణాలను నిర్ధారించుట మరియు దానికి సంబంధించిన అన్ని అంశాలను పర్యవేక్షించుట;

(బి) పోస్టు గ్రాడ్యుయేటు మరియు సూపర్ స్పెషాలిటీ విద్యార్థులలో వైద్య విద్యను బోధించుటకు మరియు వైద్య పరిశోధనను నిర్వహించుటకుగాను తగిన నైపుణ్యము, పరిజ్ఞానము, వైఖరి విలువలు మరియు నైతిక విలువలను పెంపొందించి మరియు వైద్య సంరక్షణను సమకూర్చుటకు వారికి వీలు కల్పించునట్టి రీతిలో ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి అన్ని స్థాయిలలో ఒక సామర్థ్య ఆధారిత క్రియాశీల పాఠ్య ప్రణాళికను అభివృద్ధి పరచుట;

(సి) దేశము యొక్క అవసరములు, ప్రపంచ విధి విధానములు మరియు ఈ చట్టము క్రింద చేసిన వినియమములను దృష్టిలో ఉంచుకొని ఆయుర్వేద, యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పాలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు సూపర్ స్పెషాలిటీ కోర్సులను బోధించుటకు వైద్య సంస్థలను ఏర్పాటు చేయుటపై మార్గదర్శకములను రూపొందించుట;

(డి) స్థానిక స్థాయిలలో సృజనాత్మక అవసరములను మరియు ఈ చట్టము క్రింద చేసిన వినియమములను దృష్టిలో ఉంచుకొని, వైద్య సంస్థలలో కోర్సులు మరియు పరీక్షల నిర్వహణ కొరకు కనీస ఆవశ్యకతలు మరియు ప్రమాణములను నిర్ధారించుట;

(ఇ) ఈ చట్టము క్రింద చేసిన వినియమములను అనుసరించి భారతీయ వైద్య విధానమునకు చెందిన వైద్య సంస్థలతో, మౌలిక సదుపాయముల కల్పన, ఫ్యాకల్టీ మరియు విద్య నాణ్యత మరియు పరిశోధన కొరకు ప్రమాణములు మరియు విధి విధానములను నిర్ధారించుట;

(ఎఫ్) విద్యార్థులు, ఫ్యాకల్టీ, కమీషనరు మరియు ప్రభుత్వముతో సహా వివిధ స్టేక్ హోల్డర్ల ప్రయోజనముపై నిర్దేశమును కలిగియున్న భారతీయ వైద్య విధానమునకు చెందిన వైద్య సంస్థల కృత్యములకు సంబంధించి వాటిచే ఎలక్ట్రానికల్‌గా లేక ఇతర విధముగా తప్పనిసరిగా వార్షిక వెల్లడి కొరకు విధి విధానములను నిర్దిష్టపరచుట;

(జి) ఫ్యాకల్టీ సభ్యుల అభివృద్ధి మరియు శిక్షణకు వీలు కల్పించుట;

(హెచ్) పరిశోధనా కార్యక్రమములకు వీలు కల్పించుట;

(ఐ) అన్ని స్థాయిలలోను వైద్య అర్హతలకు గుర్తింపును మంజూరు చేయుట.

(2) ఆయుర్వేద బోర్డు మరియు యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు, వాటి కృత్యములను నిర్వర్తించుటలో అది అవసరమని భావించునట్టి సిఫారసులను కమీషనుకు చేయవచ్చును మరియు అట్టి నిర్దేశములను కమీషను నుండి కోరవచ్చును.

భారతీయ వైద్య విధానము నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు అధికారములు మరియు కృత్యములు.

27. (1) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) 32వ పరిచ్ఛేదపు నిబంధనల ననుసరించి భారతీయ వైద్య విధానములో లైసెన్సు పొందిన అందరు ప్రాక్టీషనర్ల జాతీయ రిజిష్టరును నిర్వహించుట;

(బి) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి వృత్తిపరమైన నడవడిని క్రమబద్ధము చేయుట మరియు నైతిక విలువలను ప్రోత్సహించుట:

అయితే, భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, సంబంధిత రాజ్య చట్టముల క్రింద మెడికల్ ప్రాక్టీషనర్ల వృత్తిపరమైన లేదా నైతిక దుర్వర్తన విషయములో క్రమశిక్షణ చర్యలను తీసుకొనుటకు అధికారము నొసగబడిన అట్టి రాజ్య వైద్య మండలికి సంబంధించి, రాజ్య వైద్య మండలి ద్వారా వృత్తిపరమైన మరియు నైతిక నడవడి స్మృతిని పాటించునట్లు చూడవలెను;

(సి) భారతీయ వైద్య విధానమునకు చెందిన మెడికల్ ప్రాక్టీషనర్ల నడవడిని ప్రభావవంతముగా ప్రోత్సహించి మరియు నియంత్రించుటకై భారతీయ వైద్య విధానమునకు చెందిన రాజ్య వైద్య మండళ్ళతో నిరంతరం చర్చించుటకు గాను యంత్రాంగములను అభివృద్ధిపరచుట;

(డి) 31వ పరిచ్ఛేదము క్రింద రాజ్య వైద్య మండలిచే తీసుకొనబడిన చర్యలకు సంబంధించి అపిలేటు అధికార పరిధిని వినియోగించుట.

(2) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, తన కృత్యములను నిర్వర్తించుటలో అది అవసరమని భావించునట్టి సిఫారసులను కమీషనుకు చేయవచ్చును మరియు దాని నుండి అట్టి ఆదేశములను కోరవచ్చును.

భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు అధికారములు మరియు కృత్యములు.

28. (1) భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు విధించిన ప్రమాణాలను వైద్య సంస్థలు పాటించు ప్రాతిపదికపై వాటి మదింపు మరియు రేటింగు కొరకు ప్రక్రియను నిర్ధారించుట;

(బి) 29వ పరిచ్ఛేదపు నిబంధనల ననుసరించి కొత్త వైద్య సంస్థను స్థాపించుటకు లేదా ఏదేని పోస్టు గ్రాడ్యుయేటు కోర్సును ప్రారంభించుటకు లేదా సీట్ల సంఖ్యను పెంచుటకు అనుమతిని మంజూరు చేయుట;

(సి) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి అట్టి సంస్థల మదింపు మరియు రేటింగు కొరకు వైద్య సంస్థల తనిఖీలను చేపట్టుట.

అయితే, భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు, అది అవసరమని భావించినచో, అట్టి సంస్థల మదింపు మరియు రేటింగు కొరకు వైద్య సంస్థల తనిఖీని చేపట్టుటకై ఏదేని ఇతర మూడవ పార్టీ ఏజెన్సీ లేదా వ్యక్తులను అద్దెకు తీసుకొనవచ్చును మరియు ప్రాధికారమీయవచ్చును:

అంతేకాకుండా, భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డుచే ప్రాధికారమీయబడిన అట్టి మూడవ పార్టీ ఏజెన్సీ లేదా వ్యక్తులచే వైద్య సంస్థల తనిఖీ చేపట్టబడినపుడు, అట్టి ఏజెన్సీ లేదా వ్యక్తులకు వీలు కల్పించడానికి అట్టి సంస్థలు బాధ్యత వహించవలెను;

(డి) వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి సమయములో మరియు అట్టి రీతిలో, వాటి ప్రారంభపు అట్టి కాలావధిలోగా మరియు అటు పిమ్మట ప్రతి సంవత్సరము అన్ని వైద్య సంస్థల నిర్వహణ, మదింపు మరియు రేటుకు స్వతంత్ర రేటింగు ఏజెన్సీలను నిర్వహించుట లేదా అది అవసరమని భావించినపుడు వాటిని జాబితా నుండి ఎంపిక చేయుట;

(ఇ) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి, క్రమానుగత అంతరావధులలో వైద్య సంస్థల మదింపు మరియు రేటింగులను దాని వెబ్‌సైట్‌పై లేదా ప్రజా బాహుళ్యంలో లభ్యంగా ఉంచుట;

(ఎఫ్) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ననుసరించి, ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే నిర్ధిష్టపరచబడిన కనీస అత్యవసర ప్రమాణములను నిర్వహించుటకు విఫలమైనందుకు వైద్య సంస్థపై, హెచ్చరికను జారీచేయుట, ద్రవ్యరూప జరిమానాను విధించుట, ప్రవేశములను తగ్గించుట లేదా నిలిపివేయుట మరియు గుర్తింపును ఉపసంహరించుకొనుటకు కమీషనుకు సిఫారసు చేయుట వంటి వాటితో సహా అట్టి చర్యలను చేపట్టుట.

(2) భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు, తన కృత్యములను నిర్వర్తించుటలో అది అవసరమని భావించునట్టి సిఫారసులను కమీషనుకు చేయవచ్చును, మరియు అట్టి ఆదేశములను దాని నుండి కోరవచ్చును.

29. (1) భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు ముందస్తు అనుమతి లేకుండా ఏ వ్యక్తి ఒక కొత్త వైద్య సంస్థను స్థాపించరాదు లేదా ఏదేని పోస్టుగ్రాడ్యుయేటు కోర్సును ప్రారంభించరాదు లేదా సీట్ల సంఖ్యను పెంచరాదు. కొత్త వైద్య సంస్థలను స్థాపించుటకు అనుమతి.

**విశదీకరణ :** ఈ ఉప-పరిచ్ఛేదము నిమిత్తము, "వ్యక్తి" అను పద పరిధిలో ఏదేని విశ్వవిద్యాలయము లేదా ట్రస్టు లేదా ఏదేని ఇతర నికాయము చేరియుండును, అయితే కేంద్ర ప్రభుత్వము చేరియుండదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అనుమతిని పొందు నిమిత్తము, ఒక వ్యక్తి, వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో వివరములను కలిగియుండి, అట్టి ఫీజును జతపరచి మరియు అట్టి ప్రరూపములో భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డుకు ఒక పథకమును సమర్పించవచ్చును.

(3) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద స్వీకరించిన పథకాన్ని పరిశీలించినపుడు భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు, 26వ పరిచ్ఛేదము క్రింద ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్ని బట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే నిర్ధారించబడిన వైద్య సంస్థలు మరియు ఇతర ఆవశ్యకతలను ఏర్పాటు చేసిన మీదట విద్య మరియు పరిశోధనా ప్రమాణములు, మౌలిక సదుపాయములు మరియు ఫ్యాకల్టీ కొరకు ప్రమాణములు మరియు విధివిధానములు, మార్గదర్శకములను దృష్టిలో ఉంచుకొనవలెను మరియు అట్టి పథకము అందిన తేదీ నుండి మూడు మాసములలోగా దానిని ఆమోదించుటకుగాని లేదా ఆమోదించకపోవుటకు గాని సంబంధించి ఒక ఉత్తరువును జారీ చేయవలెను.

అయితే, అట్టి పథకాన్ని అనామోదము చేయుటకు ముందు, ఏవేని లోపములు ఉన్నట్లయితే, వాటిని సరిచేయుటకు ఒక అవకాశమును సంబంధిత వ్యక్తికి ఈయవలెను.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద పథకము ఆమోదించబడినపుడు, అట్టి ఆమోదము, ఒక కొత్త వైద్య సంస్థను స్థాపించుటకై ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అనుమతియై ఉండును.

(5) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద పథకము అనామోదము పొందినప్పుడు లేదా ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పథకమును సమర్పించిన మూడు మాసములలోగా, ఎట్టి ఉత్తరువు జారీ చేయబడనపుడు, సంబంధిత వ్యక్తి వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో అట్టి అనామోదము జరిగిన పదిహేను దినములలోగా లేదా సందర్భాన్నిబట్టి మూడు మాసముల కాలాతీతము తరువాత కమీషనుకు అపీలు చేసుకొనవచ్చును.

(6) కమీషను సదరు పథకమును అనామోదము చేసినపుడు లేదా ఉప-పరిచ్ఛేదము (5) క్రింద అపీలు దాఖలు చేసిన తేదీనుండి పదిహేను దినములలోగా ఎట్టి ఉత్తరువు జారీ చేయబడనపుడు, సంబంధిత వ్యక్తి, అట్టి అనామోదము తెలియచేసిన ఏడు దినములలోగా లేదా సందర్భాన్నిబట్టి, పదిహేను దినముల నిర్ధిష్ట కాలాతీత సమయానికి ఏడు దినములలోగా కేంద్ర ప్రభుత్వమునకు రెండవ అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

(7) భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు, ఎట్టి ముందస్తు నోటీసు లేకుండా నేరుగా గాని లేదా వైద్య వృత్తిలో చిత్తశుద్ధి మరియు అనుభవమును కలిగి ఉన్న ఎవరేని ఇతర నిపుణుని ద్వారాగాని ఏ సమయములోనైనా ఏదేని విశ్వవిద్యాలయము లేక వైద్య సంస్థ విలువ నిర్ధారణ మరియు మదింపును నిర్వహించవచ్చును మరియు అట్టి విశ్వవిద్యాలయము లేక వైద్య సంస్థ పనితీరు, ప్రమాణములు మరియు బెంచి మార్కుల విలువను మదింపుచేసి నిర్ధారించవచ్చును.

30. 29వ పరిచ్ఛేదము క్రింద ఒక పథకమును ఆమోదించు లేదా అనామోదించునపుడు, భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు లేదా సందర్భాన్నిబట్టి కమీషను ఈ క్రింది ప్రమాణములను పరిగణనలోనికి తీసుకొనవలెను, అవేవనగా:- పథకమును ఆమోదించుట లేక అనామోదించుటకు ప్రమాణములు.

(ఎ) మౌలిక సదుపాయములు మరియు ఆర్థిక వనరులు సరిపడినంతగా ఉండుట;

(బి) వైద్య సంస్థ సక్రమముగా పనిచేసేలా చూడటానికి గాను తగినంత విద్యా విషయక ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది మరియు ఇతర అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగినదా లేదా సదరు పథకములో నిర్ధిష్టపరచిన సమయములోగా ఏర్పాటు చేయడం జరుగుతుందా;

(సి) ఆసుపత్రి సదుపాయాలను తగినంతగా ఏర్పాటు చేయడం జరిగినదా లేక సదరు పథకములో నిర్ధిష్టపరచిన సమయములోగా ఏర్పాటు చేయడం జరుగుతుందా;

(డి) విహితపరచబడునట్టి ఇతర అంశములు:

అయితే, కేంద్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదమునకు అధ్యధీనమై, వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి ప్రాంతములలో ఏర్పాటు చేయబడు వైద్య సంస్థలకు అట్టి ప్రమాణములను సడలించవచ్చును.

31. (1) రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా ఈ చట్టపు ప్రారంభమునకు మూడు సంవత్సరములలోగా, ఆ రాజ్యములో అట్టి మండలి లేనియెడల ఆ రాజ్యములో భారతీయ వైద్య విధాన రాజ్య వైద్య మండలిని స్థాపించవలెను. రాజ్య వైద్య మండలి.

(2) భారతీయ వైద్య విధానమునకు చెందిన రిజిష్టరు చేయబడిన ప్రాక్టీషనరుచే జరుపబడిన ఏదేని వృత్తిపరమైన లేదా నైతిక దుర్వర్తనకు సంబంధించి క్రమశిక్షణ చర్యలను తీసుకొనుటకై రాజ్య వైద్యమండలికి రాజ్య చట్టము అధికారము నొసగినపుడు, రాజ్య వైద్య మండలి ఈ చట్టము క్రింద చేసిన వినియమములను మరియు రూపొందించిన మార్గదర్శకాల ననుసరించి వ్యవహరించవలెను:

అయితే, రాజ్యములో భారతీయ వైద్య విధాన రాజ్య వైద్య మండలి ఏర్పాటు చేయబడు అట్టి సమయము వరకు, భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, వినియమముల ద్వారా నిర్ధిష్టపరచబడునట్టి ప్రక్రియ ననుసరించి రాజ్యములో భారతీయ వైద్య విధానమునకు చెందిన రిజిష్టరు చేయబడిన ప్రాక్టీషనరుపై ఏదేని వృత్తిపరమైన లేక నైతిక దుర్వర్తనకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించి మరియు వ్యధలను తెలుసుకొనవలెను:

అంతేకాకుండా, భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు లేదా సందర్భాన్నిబట్టి రాజ్య వైద్యమండలి, అట్టి వ్యక్తిపై ఏదేని ద్రవ్య రూప జరిమానాను విధించుటతో సహా ఏదేని ఉత్తరువు జారీ చేయుటకు లేక ఏదేని చర్యను తీసుకొనుటకు ముందుగా, అట్టి ప్రాక్టీషనరు ఆకర్ణించుటకు ఒక అవకాశమును అతనికి ఈయవలెను.

(3) జారీచేయబడిన ఉత్తరువు ద్వారా లేదా తీసుకొనబడిన చర్యచేత వ్యధితుడైన భారతీయ వైద్య విధానమునకు చెందిన ప్రాక్టీషనరు-

(ఎ) రాజ్య వైద్య మండలి ఉప-పరిచ్ఛేదము (2) క్రింద భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డుకు అపీలును దాఖలు చేసుకొనవచ్చును మరియు భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు ఏదేని నిర్ణయం చేసినట్లయితే, అది అటు పిమ్మట, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద రెండవ అపీలు దాఖలు చేయబడిననే తప్ప అట్టి రాజ్య వైద్య మండలిపై బద్ధమై యుండును.

(బి) ఉప-పరిచ్ఛేదము (2)కు గల మొదటి వినాయింపు క్రింద భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు కమీషనుకు అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

(4) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు నిర్ణయముచే వ్యధితుడైన భారతీయ వైద్య విధాన మెడికల్ ప్రాక్టీషనరు అట్టి నిర్ణయము తెలియజేసిన అరువది దినములలోగా కమీషనుకు అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

**విశదీకరణ :** ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము,-

(ఎ) "రాజ్యము" అను పదపరిధిలో సంఘరాజ్య క్షేత్రము చేరియుండును మరియు సంఘరాజ్య క్షేత్రమునకు సంబంధించి "రాజ్య ప్రభుత్వము" మరియు "భారతీయ వైద్య విధాన రాజ్య వైద్య మండలి" అనగా వరుసగా "కేంద్ర ప్రభుత్వము" మరియు "భారతీయ వైద్య విధాన సంఘ రాజ్య క్షేత్ర వైద్య మండలి" అని అర్థము;

(బి) "వృత్తిపరమైన లేదా నైతిక దుర్వర్తన" అను పదజాలములో వినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి ఏదేని చర్య చేయుట లేదా చేయకుండా ఉండుట అనునవి చేరియుండును.

భారతీయ వైద్య విధాన జాతీయ రిజిష్టరు మరియు రాజ్య రిజిష్టరు.

32. (1) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, భారతీయ వైద్య విధాన లైసెన్సు పొందిన మెడికల్ ప్రాక్టీషనరు పేరు, చిరునామా మరియు కలిగియున్న గుర్తింపు పొందిన అన్ని అర్హతలను మరియు వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి ఇతర వివరములను కలిగియున్న ఒక జాతీయ రిజిష్టరును నిర్వహించవలెను.

(2) జాతీయ రిజిష్టరు, ఎలక్ట్రానిక్ ప్రరూపముతో సహా మరియు వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో అట్టి ప్రరూపములో నిర్వహించబడవలెను.

(3) జాతీయ రిజిష్టరుకు ఏదేని పేరు లేదా అర్హత చేర్చబడు రీతి లేదా దాని నుండి ఏదేని పేరు లేదా అర్హత తొలగించబడు రీతి మరియు అట్లు తొలగించబడుటకు గల కారణములు, వినియమములచే నిర్దిష్టపరచబడునట్లుగా ఉండవలెను.

(4) భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషన్ బోర్డు వెబ్‌సైట్‌పై ఉంచుట ద్వారా జాతీయ రిజిష్టరును ప్రజలకు అందుబాటులో ఉంచవలెను.

(5) ప్రతియొక రాజ్య వైద్య మండలి నిర్దిష్ట ఎలక్ట్రానిక్ ప్రరూపములో రాజ్య రిజిష్టరును నిర్వహించవలెను మరియు క్రమబద్ధముగా తాజాపరచవలెను మరియు ఈ చట్టము ప్రారంభము నుండి మూడు మాసములలోగా భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డుకు దాని భౌతిక నకలును పంపించవలెను.

(6) భారతీయ వైద్య విధానం నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు, ఒక రిజిష్టరులో ఏదేని మార్పు మరొక రిజిష్టరులో స్వయంచాలకముగా కనపడునట్టి రీతిలో జాతీయ రిజిష్టరు మరియు రాజ్య రిజిష్టరు ఎలక్ట్రానిక్ సమకాలీకరణముగా ఉండునట్లు చూడవలెను.

జాతీయ రిజిష్టరులో నమోదు చేయబడు వ్యక్తుల హక్కులు మరియు దానికి వారి బాధ్యతలు.

33. (1) ఈ చట్టము క్రింద భారతీయ వైద్య విధానములో గుర్తింపు పొందిన అర్హతలను కలిగివున్న మరియు 15వ పరిచ్ఛేదము క్రింద నిర్వహించిన జాతీయ నిష్క్రమణ పరీక్షలో అర్హత పొందిన ఎవరేని వ్యక్తి, భారతీయ వైద్య విధానములో ప్రాక్టీసు చేయుటకు లైసెన్సు మంజూరు చేయబడవలెను మరియు ఈ చట్టము క్రింద నిర్వహించిన రాజ్య రిజిష్టరులో మొదటిగా మరియు దరిమిలా జాతీయ రిజిష్టరులో అతని పేరు మరియు అర్హతలను నమోదు చేయించుకొనవలెను:

అయితే, ఈ చట్టము అమలులోనికి రాకపూర్వము, మరియు 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద జాతీయ నిష్క్రమణ పరీక్ష అమలులోనికి రాక పూర్వము, భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వ చట్టము) క్రింద నిర్వహించిన భారతీయ వైద్య విధాన కేంద్ర రిజిష్టరులో రిజిష్టరు చేయబడిన వ్యక్తి, ఈ చట్టము క్రింద రిజిష్టరు చేయబడినట్లుగా భావించబడవలెను మరియు ఈ చట్టము క్రింద నిర్వహించిన జాతీయ రిజిష్టరులో నమోదు చేయబడినట్లుగా భావించబడవలెను.

(2) భారతదేశము వెలుపల ఏదేని దేశములో స్థాపించబడిన వైద్య సంస్థ నుండి భారతీయ వైద్య విధానములో అర్హత పొందినట్టి మరియు ఆ దేశములో భారతీయ వైద్య విధానమునకు చెందిన మెడికల్ ప్రాక్టీషనరుగా గుర్తించబడినట్టి ఎవరేని వ్యక్తి, ఈ చట్టము ప్రారంభము తరువాత మరియు 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ నిష్క్రమణ పరీక్ష అమలులోనికి వచ్చిన తరువాత, భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ నిష్క్రమణ పరీక్షలో అతను అర్హత పొందిననే తప్ప భారతీయ వైద్య విధాన జాతీయ రిజిష్టరులో నమోదు చేయబడరాదు.

(3) రాజ్య రిజిష్టరు లేదా సందర్భాన్నిబట్టి జాతీయ రిజిష్టరులో పేరు నమోదు చేయబడిన వ్యక్తి, 35వ పరిచ్ఛేదము లేదా సందర్భాన్నిబట్టి 36వ పరిచ్ఛేదము క్రింద గుర్తింపు పొందిన అర్హతగా ఉన్నట్టి విజ్ఞాన శాస్త్రములు లేదా వైద్య శాస్త్రములో ప్రావీణ్యము కొరకు ఏదేని టైటిలు, డిప్లొమా లేదా అర్హతను పొందినపుడు, అతను వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో రాజ్య రిజిష్టరు లేదా జాతీయ రిజిష్టరులో అతని పేరుకు ఎదురుగా నమోదు చేసిన అట్టి టైటిలు, డిప్లొమో లేదా అర్హతను కలిగి ఉండుటకు అర్హులై ఉందురు.

ప్రాక్టీసు చేయుటకు వ్యక్తుల హక్కులు.

34. (1) రాజ్య రిజిష్టరు లేదా సందర్భాన్ని బట్టి జాతీయ రిజిష్టరులో నమోదు చేయబడిన వ్యక్తి కాకుండా ఎవరేని వ్యక్తి-

(ఎ) అర్హతగల ప్రాక్టీషనరుగా భారతీయ వైద్య విధానములో ప్రాక్టీసు చేయుటకు అనుమతించబడరాదు;

(బి) ఫిజిషియను లేదా సర్జను లేదా ఏదేని ఇతర పదవి, అది ఏ పేరుతో పిలవబడినప్పటికీ, ఫిజిషియను లేదా సందర్భాన్నిబట్టి సర్జనుగా ఉండుటకు ఉద్దేశించినట్టి పదవిని కలిగి ఉండరాదు;

(సి) వైద్య లేదా పాటవ ధ్రువపత్రము లేదా తగిన విధంగా అర్హత పొందిన మెడికల్ ప్రాక్టీషనరుచే సంతకం చేయబడి లేదా అధిప్రమాణీకరించబడుటకు ఏదేని శాసనము ద్వారా ఆవశ్యకమైన ఏదేని ఇతర ధ్రువపత్రమును సంతకము చేయుటకు లేదా అధిప్రమాణీకరించుటకు అర్హతకలిగి ఉండరు;

(డి) భారతీయ వైద్య విధానమునకు సంబంధించిన ఏదేని విషయముపై భారత సాక్ష్య చట్టము, 1872 (1872లోని 1వ చట్టము)లోని 45వ పరిచ్ఛేదము క్రింద ఒక నిపుణునిగా ఏదేని శవ పంచాయితీ వద్ద లేదా ఏదేని న్యాయస్థానములో సాక్ష్యమునిచ్చుటకు అర్హత కలిగివుండరు:

అయితే, కమీషను, విహితపరచబడునట్టి రీతిలో కేంద్ర ప్రభుత్వమునకు అట్టి ప్రాక్టీషనర్ల జాబితాను సమర్పించవలెను:

అంతేకాకుండా, ఏదేని విదేశములో అట్టి ప్రాక్టీషనర్ల రిజిస్ట్రేషనును క్రమబద్ధంచేయు శాసనము ననుసరించి భారతీయ వైద్య విధానములో ప్రాక్టీషనరుగా అట్టి దేశములో నమోదు చేయబడిన ఒక విదేశీ పౌరుడు, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి కాలావధికి మరియు అట్టి రీతిలో భారతదేశములో తాత్కాలిక రిజిస్ట్రేషనుకు అనుమతించబడవచ్చును.

(2) ఈ పరిచ్ఛేదములోని నిబంధనలకు వ్యతిరేకముగా వ్యవహరించు ఎవరేని వ్యక్తి, ఒక సంవత్సరము వరకు విస్తరించదగు కాలావధిపాటు కారావాసముతో లేదా ఐదు లక్షల రూపాయల వరకు విస్తరించదగు జరిమానాతోనూ లేదా రెండింటితోనూ శిక్షింపబడవలెను.

(3) ఈ పరిచ్ఛేదములో ఉన్నదేదీ-

(ఎ) ఈ చట్టము ప్రారంభము తేదీనాటికి, భారతీయ వైద్య విధానములో గుర్తింపు పొందిన ఒక అర్హతను కలిగియుండలేదనే కారణమున మాత్రమే ఏదేని రాజ్యములో ప్రాక్టీసు చేయుటకు భారతీయ వైద్య విధానమునకు చెందిన ప్రాక్టీషనరుగా రాజ్య రిజిష్టరులో నమోదు చేయబడిన వ్యక్తి యొక్క హక్కుకు ప్రభావము కలిగించదు;

(బి) ఏదేని వైద్య విధానము ప్రాక్టీసు చేయుటకు హక్కుతో సహా, ఆ రాజ్యమునకు చెందిన రాజ్య రిజిష్టరులో నమోదు చేయబడిన భారతీయ వైద్య విధానమునకు చెందిన ప్రాక్టీషనర్లపై రాజ్యములో ప్రస్తుతము అమలులో ఉన్న ఏదేని చట్టము ద్వారా లేదా దాని క్రింద ఒసగబడిన ప్రత్యేక హక్కులకు ప్రభావము కలిగించదు;

(సి) ఈ చట్టము ప్రారంభము తేదీనాటికి భారతీయ వైద్య విధానమునకు చెందిన రాజ్య రిజిష్టరు నిర్వహించబడని అట్టి రాజ్యములో ప్రాక్టీసును కొనసాగించుటకు, రాజ్యములో ఐదు సంవత్సరములకు తక్కువ కాకుండా భారతీయ వైద్య విధానములో ప్రాక్టీసు చేయుచున్న వ్యక్తి యొక్క హక్కుకు ప్రభావము కలిగించదు.

## అధ్యాయము - VI

## భారతీయ వైద్య విధాన అర్హతల గుర్తింపు

భారతదేశములోని విశ్వవిద్యాలయములో లేదా వైద్య సంస్థలచే మంజూరు చేయబడిన అర్హతల గుర్తింపు.

35. (1) భారతదేశములోని ఏదేని విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థచే మంజూరు చేయబడిన అండర్-గ్రాడ్యుయేటు లేక పోస్టుగ్రాడ్యుయేటు లేక సూపర్ స్పెషాలిటీ స్థాయిలో భారతీయ వైద్య విధానములోని వైద్య అర్హతలు, వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో ఆయుర్వేద బోర్డు లేదా యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే సందర్భాన్నిబట్టి, జాబితాగా వ్రాయబడవలెను మరియు నిర్వహించబడవలెను మరియు అట్టి వైద్య అర్హతలు ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము గుర్తింపు పొందిన వైద్య అర్హతలుగా ఉండవలెను.

(2) ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే నిర్వహించబడిన జాబితాలో చేర్చబడని భారతీయ వైద్య విధానములోని అండర్ గ్రాడ్యుయేటు లేదా పోస్టుగ్రాడ్యుయేటు లేదా సూపర్ స్పెషాలిటీ అర్హతను మంజూరు చేయు భారతదేశములోని ఏదేని విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థ, అట్టి అర్హతకు గుర్తింపును మంజూరు చేయుటకై ఆ బోర్డుకు దరఖాస్తు చేసుకొనవచ్చును.

(3) ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు, వినియమములచే నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో ఆరు మాసముల కాలావధిలోగా భారతీయ వైద్య విధానములోని ఒక అర్హతకు గుర్తింపును మంజూరు చేయుటకై దరఖాస్తును పరిశీలించవలెను.

(4) ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు, భారతీయ వైద్య విధానములోని అర్హతకు గుర్తింపును మంజూరు చేయుటకు నిర్ణయించినపుడు, అది నిర్వహించిన జాబితాలో అట్టి అర్హతను చేర్చవలెను మరియు అట్టి గుర్తింపు అమలు తేదీని కూడా అందులో నిర్ధిష్టపరచవచ్చును, లేనట్లయితే అది వైద్య అర్హతకు గుర్తింపును మంజూరు చేయకూడదను తన నిర్ణయమును సంబంధిత విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థకు తెలియచేయవలెను.

(5) వ్యథిత విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థ, ఆయుర్వేద బోర్డు లేదా సందర్భాన్ని బట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు నిర్ణయము తెలియచేసిన తేదీ నుండి అరువది దినముల కాలావధి లోపల వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో కమీషనుకు అపీలును చేసుకొనవచ్చును.

(6) కమీషను రెండు నెలల కాలావధిలోగా ఉప-పరిచ్ఛేదము (5) క్రింద అందిన అపీలును పరిశీలించవలెను మరియు అట్టి వైద్య అర్హతకు గుర్తింపును మంజూరు చేయవచ్చునని అది నిర్ణయించినచో, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో బోర్డుచే నిర్వహించబడిన జాబితాలో అట్టి అర్హతను చేర్చవలెనని సంబంధిత బోర్డును ఆదేశించవచ్చును.

(7) ఉప-పరిచ్ఛేదము (6) క్రింద గుర్తింపును మంజూరు చేయరాదని కమీషను భావించినపుడు లేదా నిర్దిష్ట కాలావధి లోపల నిర్ణయించుటకు విఫలమైనపుడు, వ్యథిత విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థ, అట్టి నిర్ణయము అందిన తేదీ నుండి లేదా సందర్భాన్నిబట్టి నిర్దిష్ట కాలావధి గడచిన తేదీ నుండి ముప్పది దినముల కాలావధిలోగా కేంద్ర ప్రభుత్వమునకు రెండవ అపీలును దాఖలు చేసుకొనవచ్చును.

(8) ఈ చట్టపు ప్రారంభపు తేదీకి పూర్వము గుర్తింపబడినట్టి మరియు భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వ చట్టము)నకు గల రెండవ అనుసూచి మరియు మూడవ అనుసూచిలో చేర్చబడినట్టి అన్ని వైద్య అర్హతలు, ఆయుర్వేద బోర్డు లేదా యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే సందర్భాన్నిబట్టి, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో కూడా జాబితాగా వేయబడవలెను మరియు నిర్వహించబడవలెను.

భారతదేశం వెలుపల వైద్య సంస్థలచే మంజూరు చేయబడిన వైద్య అర్హతల గుర్తింపు.

36. (1) భారతదేశం వెలుపల ఏదేని దేశములో ఆ దేశములోని శాసనము ద్వారా ఆ దేశములో భారతీయ వైద్య విధాన అర్హతల గుర్తింపును అప్పగించబడిన ఒక ప్రాధికార సంస్థ భారతదేశములో అట్టి అర్హతకు గుర్తింపును మంజూరు చేయుట కొరకు కమీషనుకు దరఖాస్తు చేసినపుడు, కమీషను, అది అవసరమని భావించినట్టి సత్యాపనకు అధ్యధీనమై సదరు వైద్య అర్హత గుర్తింపును మంజూరు చేయుటగాని లేదా తిరస్కరించుట గాని చేయవచ్చును.

(2) కమీషను ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏదేని వైద్య అర్హతకు గుర్తింపును మంజూరు చేయునపుడు, అట్టి అర్హత ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము గుర్తింపు పొందిన అర్హతగా ఉండవలెను మరియు నిర్ధిష్టపరచబడునట్టి రీతిలో కమీషనుచే నిర్వహించబడిన జాబితాలో చేర్చబడవలెను:

అయితే, ఏదేని అర్హతకు గుర్తింపును మంజూరు చేయరాదని కమీషను నిర్ణయించిన సందర్భములో అట్టి గుర్తింపును మంజూరు చేయుటకు తిరస్కరించుటకు ముందుగా అట్టి ప్రాధికార సంస్థ ఆకర్ణింపబడుటకు దానికి తగిన అవకాశమును కమీషను ఈయవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఒక వైద్య అర్హతకు గుర్తింపును మంజూరు చేయుటకు కమీషను తిరస్కరించినపుడు, సంబంధిత ప్రాధికార సంస్థ గుర్తింపును మంజూరు చేయుట కొరకు కేంద్ర ప్రభుత్వమునకు అపీలు చేసుకొనవచ్చును.

(4) ఈ చట్టపు ప్రారంభపు తేదీకి పూర్వము గుర్తించబడినట్టి మరియు భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వది)నకు గల నాల్గవ అనుసూచిలో చేర్చబడినట్టి అన్ని అర్హతలు కూడా ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము గుర్తింపు పొందిన వైద్య అర్హతలుగా ఉండవలెను మరియు వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో కమీషనుచే జాబితాగా వ్రాయబడవలెను మరియు నిర్వహించబడవలెను.

అర్హతల గుర్తింపును ఉపసంహరించుట లేదా రద్దు చేయుట.

37. (1) భారతీయ వైద్య విధాన వైద్య మదింపు మరియు రేటింగు బోర్డు నుండి అందిన నివేదికపై లేక ఇతర విధముగా కమీషను-

(ఎ) విశ్వవిద్యాలయము లేక వైద్య సంస్థలో అభ్యర్థులు చేయు అధ్యయన కోర్సులు మరియు లోనగు పరీక్షలో లేదా నిర్వహించిన ఏదేని పరీక్షలో అవసరమైన అభ్యర్థుల ప్రావీణ్యము, ఆయుర్వేద బోర్డు లేక సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డుచే నిర్దిష్టపరచబడిన ప్రమాణములకు అనుగుణముగా లేదని; లేదా

(బి) ఆయుర్వేద బోర్డు లేక యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు, సందర్భాన్ని బట్టి నిర్ధారించిన వైద్య సంస్థలలోని మౌలిక సదుపాయములు, ఫ్యాకల్టీ మరియు విద్యా నాణ్యత కొరకు ప్రమాణములు మరియు విధి విధానములకు ఏదేని విశ్వవిద్యాలయము లేక వైద్య సంస్థ గట్టిగా కట్టుబడియుండనపుడు, మరియు అట్టి విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థ నిర్దిష్ట కనీస ప్రమాణములను పాటించుటకై అవసరమైన దిద్దుబాటు చర్యను తీసుకొనుటకు విఫలమైనదని, భావించినపుడు, అది ఉప-పరిచ్ఛేదము (2)లోని నిబంధనల ప్రకారము చర్యను ప్రారంభించవచ్చును.

అయితే, కమీషను విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థచే ప్రదానము చేయబడిన అర్హతకు మంజూరు చేయబడిన గుర్తింపును తనంతతానుగా ఉపసంహరించుకొనుటకు ఏదేని చర్యను తీసుకొనుటకు ముందుగా, 28వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఎఫ్) నిబంధనల ననుసరించి జరిమానాను విధించవలెను.

(2) కమీషను, అది ఉచితమని భావించినట్టి తదుపరి విచారణ చేసిన తరువాత, మరియు రాజ్య ప్రభుత్వము మరియు సంబంధిత విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థ యొక్క ప్రాధికార సంస్థను సంప్రదించిన మీదట వైద్య సంస్థకు మంజూరు చేసిన గుర్తింపును ఉపసంహరించుకొనవలెనను నిర్ణయమునకు వచ్చిన తరువాత, అది అట్టి వైద్య సంస్థకు మంజూరు చేసిన గుర్తింపును ఉత్తరువు ద్వారా ఉపసంహరించుకొనవచ్చును మరియు అట్టి ఉత్తరువులో నిర్దిష్టపరచిన తేదీ నుండి అట్టి అర్హతకు మంజూరు చేసిన గుర్తింపు ఉపసంహరించబడినదని, ఆ బోర్డుచే నిర్వహించబడిన జాబితాలో సంబంధిత విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థలకు ఎదురుగా నమోదులను ఆమేరకు సవరించడానికి ఆయుర్వేద బోర్డు, లేదా సందర్భాన్నిబట్టి యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డులను ఆదేశించవచ్చును.

(3) కమీషను, భారతదేశము వెలుపలగల ఏదేని దేశములోని ప్రాధికార సంస్థతో సత్యాపన చేసిన మీదట, దానిచే నిర్వహించబడిన జాబితాలో చేర్చబడిన వైద్య అర్హత గుర్తింపు రద్దు చేయబడవలసి ఉన్నదని అభిప్రాయపడినయెడల అది, అట్టి వైద్య సంస్థ గుర్తింపును ఉత్తరువు ద్వారా రద్దు చేయవచ్చును మరియు అట్టి ఉత్తరువు తేదీ నుండి, కమీషనుచే నిర్వహించబడిన జాబితా నుండి దానిని తొలగించవచ్చును.

అర్హతల గుర్తింపు కొరకు కొన్ని సందర్భాలలో ప్రత్యేక నిబంధన.

38. అట్లు చేయుట అవసరమని కమీషను భావించినపుడు అది అధిసూచన ద్వారా, సదరు అధిసూచనలో నిర్దిష్టపరచబడునట్టి తేదీ తరువాత భారతదేశము వెలుపల వైద్య సంస్థచే మంజూరు చేయబడిన భారతీయ వైద్య విధానములోని ఏదేని అర్హత, ఈ చట్టపు ప్రయోజనముల కొరకు గుర్తింపు పొందిన అర్హతగా ఆదేశించవచ్చును:

అయితే, అట్టి అర్హతను కలిగివున్న వ్యక్తిచే చేయబడు వైద్య ప్రాక్టీసు, ఆ దేశములో తత్సమయములో అమలులోవున్న వైద్య ప్రాక్టీషనరు రిజిస్ట్రేషనును క్రమబద్ధం చేయుచున్నట్టి శాసనమునకు అనుగుణంగా వైద్య ప్రాక్టీషనరుగా అట్టి వ్యక్తి నమోదు చేయబడి ఉన్నచో, అనుమతించబడవలెను:

అంతేకాకుండా, అట్టి అర్హతను కలిగివున్నట్టి వ్యక్తిచే చేయబడు వైద్య ప్రాక్టీసు ఆ ఉత్తరువులో నిర్దిష్టపరచబడునట్టి కాలావధికి పరిమితం చేయబడవలెను:

అంతేకాకుండా ఇంకనూ, అట్టి అర్హతలు కలిగివున్న వ్యక్తిచే చేయబడు వైద్య ప్రాక్టీసు, జాతీయ నిష్క్రమణ పరీక్షలో అట్టి వ్యక్తి అర్హత పొందినపుడు మాత్రమే అనుమతించబడవలెను.

## అధ్యాయము - VII

## అనుదానములు, ఆడిటు మరియు లెక్కలు

కేంద్ర ప్రభుత్వ అనుదానములు.

39. కేంద్ర ప్రభుత్వము, ఇందు కోసం శాసనము ద్వారా, పార్లమెంటు ద్వారా తగిన ద్రవ్య వినియోగము చేసిన తరువాత, కేంద్ర ప్రభుత్వము ఉచితమని భావించినట్టి ద్రవ్య మొత్తములు అనుదానములను కమీషనుకు చేయవచ్చును.

భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ కమీషను నిధి.

40. (1) "భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ కమీషను నిధి" అనబడే ఒక నిధి ఏర్పాటు చేయబడవలెను మరియు దానికి ఈ క్రింది వాటిని జమచేయవలెను.

(ఎ) ప్రభుత్వ అనుదానములు, ఫీజులు, జరిమానాలు మరియు కమీషను మరియు స్వయంపాలక బోర్డులచే స్వీకరించబడిన ఛార్జీలు;

(బి) దానిచే నిర్ణయించబడునట్టి ఇతర వనరు నుండి కమీషనుచే స్వీకరించబడిన అన్ని మొత్తములు;

(2) ఈ క్రింది వాటికి చెల్లింపుచేయు నిమిత్తము సదరు నిధి వినియోగించబడవలెను-

(ఎ) కమీషను, ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు, స్వయంపాలక బోర్డుల అధ్యక్షులు మరియు సభ్యులకు చెల్లించదగు జీతబత్తెములు మరియు కమీషను మరియు స్వయంపాలక బోర్డుల అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీతబత్తెములతో సహా పరిపాలకపరమైన ఖర్చులు;

(బి) కమీషను మరియు స్వయంపాలక బోర్డుల కృత్యముల నిర్వహణతో సంబంధము కలిగివున్న వాటితో సహా ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటలో భరించిన లేదా భరించునట్టి ఖర్చులు.

ఆడిటు మరియు లెక్కలు.

41. (1) కమీషను సరియైన లెక్కలు మరియు ఇతర సంబంధిత రికార్డులను నిర్వహించవలెను మరియు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటర్ జనరలును సంప్రదించి విహితపరచబడునట్టి ప్రరూపములో ఒక వార్షిక లెక్కల వివరణ పట్టికను తయారు చేయవలెను.

(2) కమీషను లెక్కలు, భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుచే నిర్దిష్ట పరచబడునట్టి అంతరావధులలో అతనిచే ఆడిటు చేయబడవలెను మరియు అట్టి ఆడిటుకు సంబంధించి చేసిన ఏదేని ఖర్చు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటర్ జనరలుకు కమీషనుచే చెల్లించబడవలెను.

(3) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటర్ జనరలు మరియు కమీషను లెక్కలను ఆడిటు చేయుటకు సంబంధించి అతనిచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తులు, ప్రభుత్వ లెక్కలను ఆడిటు చేయుటకు సంబంధించి కంప్ట్రోలరు మరియు ఆడిటర్ జనరలు సాధారణముగా కలిగివున్న హక్కులు మరియు ప్రత్యేక హక్కులను కలిగియుండునో కమీషను లెక్కల ఆడిటుకు సంబంధించి అవే హక్కులు మరియు ప్రత్యేక హక్కులను కలిగివుండవలెను మరియు ప్రత్యేకించి, కమీషనుకు చెందిన రికార్డులు, పుస్తకములు, లెక్కలు, సంబంధిత ఓచర్లు మరియు ఇతర పత్రములను ప్రవేశపెట్టమని కోరుటకు మరియు వాటిని పూర్తిగా అందుబాటులో ఉంచుకొనుటకు మరియు కమీషను కార్యాలయమును తనిఖీ చేయుటకు హక్కును కలిగియుండవలెను.

(4) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేదా ఇందు కోసం అతనిచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తిచే ధ్రువీకరించబడిన లెక్కలు, వాటి ఆడిటు నివేదికతో కలిపి కేంద్ర ప్రభుత్వమునకు వార్షికముగా కమీషను పంపించవలెను అది అందిన పిమ్మట వీలైనంత త్వరగా దానిని పార్లమెంటు ఉభయ సదనముల సమక్షమున ఉంచునట్లు చేయవలెను.

కేంద్ర ప్రభుత్వమునకు రిటర్నులు మరియు నివేదికలను పంపించుట.

42. (1) కమీషను, ఆయా సమయములలో కేంద్ర ప్రభుత్వము కోరిన విధముగా కమీషను అధికార పరిధి క్రింద ఉన్నట్టి ఏదేని విషయమునకు సంబంధించిన అట్టి నివేదికలు మరియు వివరణలు మరియు అట్టి వివరములను విహితపరచబడునట్టి లేదా కేంద్ర ప్రభుత్వము ఆదేశించునట్టి సమయము, అట్టి ప్రరూపము మరియు అట్టి రీతిలో కేంద్ర ప్రభుత్వమునకు పంపించవలెను.

(2) కమీషను, గత సంవత్సరములో తన కార్యకలాపములను సంక్షిప్తముగా తెలియజేస్తూ విహితపరచబడునట్టి ప్రరూపము మరియు అట్టి సమయములో ప్రతియొక సంవత్సరమునకు ఒకసారి ఒక వార్షిక నివేదికను తయారు చేయవలెను మరియు నివేదిక ప్రతులను కేంద్ర ప్రభుత్వమునకు పంపించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద అందిన నివేదిక నొకదానిని అది అందిన తరువాత వీలైనంత త్వరగా పార్లమెంటు ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.

## అధ్యాయము - VIII

## వివిధములు

కమీషను మరియు స్వయంపాలక బోర్డులకు ఆదేశములను ఇచ్చుటకై కేంద్ర ప్రభుత్వ అధికారము.

43. (1) ఈ చట్టములోని పై నిబంధనలకు భంగం వాటిల్లకుండా, కమీషను మరియు స్వయంపాలక బోర్డులు, ఈ చట్టము క్రింద అధికారాలను వినియోగిస్తూ తమ కృత్యములను నిర్వర్తిస్తూ ఆయా సమయములలో వాటికి వ్రాతపూర్వకముగా విధాన సమస్యలపై కేంద్ర ప్రభుత్వము ఇచ్చునట్టి ఆదేశములకు కట్టుబడియుండవలెను:

అయితే, కమీషను మరియు స్వయంపాలక బోర్డులు, అమలుకు సాధ్యమైనంత వరకు, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద ఏదేని ఆదేశమును ఇచ్చుటకు ముందుగా తమ అభిప్రాయములను తెలియపరచుటకు ఒక అవకాశమును ఈయబడవలెను.

(2) సమస్య విధానపరమైనదా, కాదా అన్న దానిపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయము అంతిమమైనదైయుండును.

రాజ్య ప్రభుత్వమునకు ఆదేశములనిచ్చుటకు కేంద్ర ప్రభుత్వ అధికారము.

44. కేంద్ర ప్రభుత్వము, ఈ చట్టపు అన్ని లేక ఏవేని నిబంధనలను అమలుపరచుట కొరకు రాజ్య ప్రభుత్వమునకు అది అవసరమని భావించునట్టి ఆదేశములను జారీచేయవచ్చును మరియు రాజ్య ప్రభుత్వము అట్టి ఆదేశములను పాటించవలెను.

కమీషను ఈయవలసిన సమాచారము మరియు దాని ప్రచురణ.

45. (1) కమీషను, ప్రభుత్వము కోరునట్టి నివేదికలు, దాని మినిట్స్ ప్రతులు, దాని లెక్కల సంక్షిప్తులను మరియు ఇతర సమాచారమును కేంద్ర ప్రభుత్వమునకు పంపించవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దానికి పంపించిన నివేదికలు, మినిట్స్, లెక్కల సంక్షిప్తులు మరియు ఇతర సమాచారమును అది ఉచితమని భావించినట్టి రీతిలో ప్రచురించవలెను.

విశ్వవిద్యాలయములు మరియు వైద్య సంస్థల బాధ్యత.

46. ఈ చట్టము క్రిందకు వచ్చు ప్రతియొక విశ్వవిద్యాలయము మరియు వైద్య సంస్థలు అన్ని వేళలా ఒక వెబ్‌సైట్‌ను నిర్వహించవలెను మరియు కమీషను లేదా సందర్భాన్నిబట్టి స్వయంపాలక బోర్డుచే కోరబడునట్టి సమాచారమునంతా దాని వెబ్‌సైటులో చూపించవలెను.

వైద్య సంస్థలలో అధ్యయన కోర్సులను పూర్తి చేయుట.

47. (1) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికీ, ఈ చట్టము ప్రారంభమునకు అవ్యవహితా పూర్వము ఏదేని వైద్య సంస్థలు డిగ్రీ లేదా డిప్లొమో కొరకు అధ్యయనము చేయుచుండెడి ఎవరేని విద్యార్థి, అట్టి డిగ్రీ లేదా డిప్లొమో కొరకు అతని కోర్సు అధ్యయనమును కొనసాగించి, పూర్తి చేయవలెను మరియు అట్టి సంస్థ బోధనల ఏర్పాటును కొనసాగించి మరియు అట్టి ప్రారంభమునకు ముందుగా ఉన్నట్టి పాఠ్యప్రణాళిక మరియు అధ్యయనముల ననుసరించి అట్టి విద్యార్థికి పరీక్షను నిర్వహించవలెను మరియు అట్టి విద్యార్థి ఈ చట్టము క్రింద అతని అధ్యయన కోర్సును పూర్తి చేసినట్లుగా భావించబడవలెను మరియు ఈ చట్టము క్రింద డిగ్రీ లేదా డిప్లొమాను ప్రదానము చేయబడవలెను.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికీ, కాలగతిన లేదా స్వచ్ఛందంగా దానిని స్వాధీనపరచుట ద్వారా లేదా ఏదేని ఇతర కారణమునకు, అది ఏమైనప్పటికీ, ఒక వైద్య సంస్థకు మంజూరు చేయబడిన గుర్తింపు కాలాతీతమైనపుడు, అట్టి వైద్య సంస్థలో అధ్యయనం చేస్తున్నట్టి అభ్యర్థులందరూ తమ అధ్యయనము పూర్తయ్యే అట్టి సమయం వరకు కమీషనుచే ఆమోదించబడిన కనీస ప్రమాణాలను పాటించి మరియు వీలు కల్పించుటను అది కొనసాగించవలెను.

48. కమీషను యొక్క ఛైర్‌పర్సన్, సభ్యులు, అధికారులు మరియు ఇతర ఉద్యోగులు మరియు స్వయంపాలక బోర్డులకు చెందిన అధ్యక్షుడు మరియు సభ్యులు, ఈ చట్టములోని ఏవేని నిబంధనలను పురస్కరించుకొని వ్యవహరించినపుడు లేదా వ్యవహరించుటకు ఉద్దేశించినపుడు భారతీయ శిక్షాస్మృతి (1860లోని 45వది)లోని 21వ పరిచ్ఛేదపు అర్థము లోపల ప్రజా సేవకులుగా భావించబడవలెను. కమీషను మరియు స్వయంపాలక బోర్డుల ఛైర్‌పర్సన్, సభ్యులు, అధికారులు ప్రజా సేవకులుగా ఉండుట.

49. ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన నియమములు లేదా వినియమముల క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైననూ, ప్రభుత్వము, కమీషను లేదా ఏదేని స్వయంపాలక బోర్డు లేదా రాజ్య వైద్య మండలి లేదా వాటికి చెందిన ఏదేని కమిటీ, ఈ చట్టము క్రింద వ్యవహరించు ప్రభుత్వ లేక కమీషనుకు చెందిన ఇతర ఉద్యోగులపై ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర శాసనిక చర్య ఉండరాదు. సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ.

50. కమీషను లేదా నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డు లేదా భారతీయ వైద్య విధాన రాజ్య వైద్య మండలిచే సందర్భాన్నిబట్టి అధీకృత అధికారిచే ఇందు నిమిత్తం వ్రాతపూర్వకంగా చేసిన ఫిర్యాదుపై తప్ప ఈ చట్టము క్రింద శిక్షింపదగు ఏదేని అపరాధమును ఏ న్యాయస్థానము సంజ్ఞేయము చేయరాదు. అపరాధముల సంజ్ఞేయము.

51. (1) కేంద్ర ప్రభుత్వము ఎప్పుడైనా- కమీషనును రద్దు చేయుటకు కేంద్ర ప్రభుత్వ అధికారము.

(ఎ) ఈ చట్టపు నిబంధనల ద్వారా లేదా వాటి క్రింద విధించిన కృత్యములు మరియు కర్తవ్యములను నెరవేర్చుటకు కమీషనుకు సమర్థత లేదని; లేదా

(బి) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే జారీచేయబడిన ఏదేని ఆదేశములు పాటించుటలో లేదా ఈ చట్టములోని నిబంధనల ద్వారా లేదా వాటి క్రింద విధించిన కృత్యములు మరియు కర్తవ్యములను నెరవేర్చుటలో నిరంతరము కమీషను ఉపేక్ష వహిస్తున్నదని,

భావించినపుడు, అది అధిసూచన ద్వారా అందులో నిర్దిష్టపరచబడునట్టి కాలావధికి, ఆరు మాసములు మించకుండా కమీషనును రద్దు చేయవచ్చును:

అయితే, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద అధిసూచనను జారీచేయుటకు ముందుగా కేంద్ర ప్రభుత్వము కమీషనును ఎందుకు రద్దు చేయరాదో కారణమును తెలియచేయవలసిందిగా దానికి తగిన అవకాశమును ఈయవలెను మరియు కమీషనుకు సంజాయిషీలు మరియు అభ్యంతరములు ఏవేని ఉన్నచో వాటిని పర్యాలోచించవలెను.

(2) కమీషనును రద్దుచేస్తూ, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అధిసూచనను ప్రచురించిన మీదట,-

(ఎ) రద్దుచేసిన తేదీ నుండి సభ్యులందరూ అటువంటి పదవులను ఖాళీ చేయవలెను;

(బి) ఈ చట్టములోని నిబంధనల ద్వారా లేదా వాటి క్రింద కమీషనుచే లేదా దాని తరపున వినియోగించదగు లేదా నెరవేర్చదగు అన్ని అధికారములు, కృత్యములు మరియు కర్తవ్యములు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కమీషను తిరిగి ఏర్పాటు చేయబడువరకు కేంద్ర ప్రభుత్వము ఆదేశించినట్టి వ్యక్తి లేదా వ్యక్తులచే వినియోగించబడవలెను మరియు నిర్వర్తించబడవలెను;

(సి) కమీషను స్వాయత్తము లేక నియంత్రణను కలిగియున్న ఆస్తి అంతయూ, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కమీషను తిరిగి ఏర్పాటు చేయబడు వరకు కేంద్ర ప్రభుత్వములో నిహితమైయుండును.

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీచేసిన అధిసూచన ద్వారా నిర్ధిష్టపరచబడిన రద్దు కాలావధి ముగిసిన మీదట, కేంద్ర ప్రభుత్వము,-

(ఎ) అది అవసరమని భావించునట్టి ఆరు మాసములకు మించని అట్టి తదుపరి కాలావధికి రద్దు కాలావధిని పొడిగించవచ్చును; లేదా

(బి) తాజా నియామకము ద్వారా కమీషను తిరిగి ఏర్పాటు చేయవచ్చును మరియు అట్టి సందర్భములో ఉప-పరిచ్ఛేదము (2)లోని ఖండము (ఎ) క్రింద పదవులను ఖాళీచేసిన సభ్యులు, నియామకము కొరకు నిరర్హులైనట్లుగా భావించబడరాదు:

అయితే, కేంద్ర ప్రభుత్వము, రద్దు కాలావధి ముగియుటకు ముందు ఎప్పుడైననూ, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రారంభములో నిర్ధిష్టపరచినట్లుగా గాని లేదా ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద పొడిగించబడినట్లుగా గాని ఈ ఉప-పరిచ్ఛేదములోని ఖండము (బి) క్రింద చర్యను తీసుకొనవచ్చును.

(4) కేంద్ర ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీచేసిన అధిసూచన మరియు ఈ పరిచ్ఛేదము క్రింద తీసుకొనిన ఏదేని చర్య మరియు అట్టి చర్యకు దారితీసిన పరిస్థితులు యొక్క పూర్తి నివేదికను వీలైనంత శీఘ్రముగా పార్లమెంటు ఉభయ సదనముల సమక్షములో ఉంచునట్లు చేయవలెను.

కమీషను, హోమియోపతి, జాతీయ కమీషను మరియు జాతీయ వైద్య కమీషను కొరకు సంయుక్త సమావేశములు.

52. (1) భారతీయ వైద్య విధానము, హోమియోపతి మరియు ఆధునిక వైద్య విధానము మధ్య సమన్వయమును పెంపొందించడానికై వారు పరస్పరం నియతముచేయు అట్టి ప్రదేశములో కనీసం సంవత్సరమునకు ఒకసారి కమీషను, హోమియోపతి జాతీయ కమీషను, మరియు జాతీయ వైద్య కమీషను మధ్య ఒక సంయుక్త సమావేశము ఉండవలెను.

(2) సంయుక్త సమావేశపు అజెండాను సంబంధిత కమీషన్ల ఛైర్‌పర్సన్లచే పరస్పర ఒప్పందంతో ఉంచవచ్చును.

(3) సంయుక్త సమావేశము, హాజరయి మరియు ఓటింగుచేయు సభ్యులందరి అనుకూల ఓటు ద్వారా వైద్య విధానములలోని అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశపెట్టగలిగినట్టి నిర్ధిష్ట విద్య మరియు వైద్య విధానములు లేదా కార్యక్రమాన్ని ఆమోదించుటపై నిర్ణయించవచ్చును మరియు వైద్య బహుళ వ్యవస్థను పెంపొందించవచ్చును.

రాజ్య ప్రభుత్వము ప్రజారోగ్యమును పెంపొందించుట.

53. ప్రతియొక రాజ్య ప్రభుత్వము, ప్రజారోగ్యమును పరిష్కరించుటకు లేదా పెంపొందించు నిమిత్తము ఆరోగ్య సంరక్షణ వృత్తి నిపుణుల సామర్థ్యాన్ని పెంచుటకై తగిన చర్యలను చేపట్టవచ్చును.

నియమములను చేయుటకు అధికారములు.

54. (1) కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా ఈ చట్టమును అమలుచేయు నిమిత్తము నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు మరియు పై అధికారమునకు భంగము వాటిల్లకుండా ఈ క్రింది అన్ని లేక ఏవేని విషయముల కొరకు అట్టి నియమములను చేయవచ్చును, అవేవనగా,

(ఎ) 4వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (బి) క్రింద సలహా మండలిలో రాజ్యములు మరియు సంఘ రాజ్య క్షేత్రముల నామనిర్దేశితులలో నుండి వంతులవారీ ప్రాతిపదికన కమీషను సభ్యులను నియమించు రీతి;

(బి) 4వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము(సి) క్రింద సభ్యులను నియమించు రీతి;

(సి) 5వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (డి) క్రింద కేంద్ర ప్రభుత్వముచే ఒక నిపుణుని నామనిర్దేశము చేయు రీతి;

(డి) 6వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద ఛైర్‌పర్సన్ మరియు సభ్యులకు చెల్లించదగు జీతబత్తెములు మరియు వారి ఇతర సేవా నిబంధనలు మరియు షరతులు;

(ఇ) 6వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (6) క్రింద ప్రఖ్యానము చేయు ప్రరూపము మరియు రీతి;

(ఎఫ్) 8వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద కార్యదర్శి కలిగివుండవలసిన అర్హతలు మరియు అనుభవము;

(జి) 8వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (6) క్రింద కమీషను యొక్క కార్యదర్శి, అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీతబత్తెములు మరియు వారి ఇతర నిబంధనలు మరియు షరతులు;

(హెచ్) 10వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (జె) క్రింద కమీషనుచే వినియోగించదగు ఇతర అధికారములు మరియు నిర్వహించదగు ఇతర కృత్యములు;

(ఐ) 21వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద స్వయంపాలక బోర్డు అధ్యక్షుడు మరియు సభ్యులకు చెల్లించదగు జీతబత్తెములు మరియు వారి ఇతర నిబంధనలు మరియు షరతులు;

(జె) 30వ పరిచ్ఛేదపు, ఖండము (డి) క్రింద ఇతర అంశములు;

(కె) 34వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)కి గల మొదటి వినాయింపు క్రింద ప్రాక్టీషనర్ల జాబితాను సమర్పించు రీతి;

(ఎల్) 41వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద వార్షిక లెక్కల వివరణను తయారుచేయుటకు ప్రరూపము;

(ఎం) 42వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద కేంద్ర ప్రభుత్వముచే కోరబడునట్టి ఏదేని విషయమునకు సంబంధించి కమీషనుచే సమర్పించవలసియున్న నివేదికలు మరియు వివరణలు మరియు వివరముల సమయము మరియు ప్రరూపము మరియు రీతి;

(ఎన్) 42వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద వార్షిక నివేదికను తయారు చేయుటకు ప్రరూపము మరియు సమయము;

(ఓ) 58వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3)కు గల రెండవ వినాయింపు క్రింద గడువుకు ముందే ఉపాధిని పరిసమాప్తి చేసినందుకు పరిహారము;

(పి) నియమముల ద్వారా చేయబడు నిబంధనలకు సంబంధించిన ఏదేని ఇతర విషయము.

వినియమములను చేయుటకు అధికారములు.

55. (1) కమీషను, అధిసూచన ద్వారా ఈ చట్టములోని నిబంధనలను అమలుచేయుటకై ఈ చట్టము మరియు దాని క్రింద చేసిన నియమములకు సంగతమైన వినియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, మరియు పై అధికార వ్యాపకతకు భంగము వాటిల్లకుండా ఈ క్రింది అన్ని లేక వాటిలో ఏవేని విషయముల కొరకు అట్టి వినియమములను నిబంధించవచ్చును, అవేవనగా;

(ఎ) 8వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద కమీషను కార్యదర్శిచే నిర్వర్తించబడు కృత్యములు;

(బి) 8వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (7) క్రింద నిపుణులు మరియు వృత్తిపరమైన నిపుణులను వినియోగించుటకు అనుసరించదగు కార్యవిధానము మరియు అట్టి నిపుణులు మరియు వృత్తిపర నిపుణుల సంఖ్య;

(సి) 9వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కమీషను సమావేశములలో కోరంతో సహా దాని సమావేశములలో అనుసరించదగు కార్యవిధానము;

(డి) 10వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఏ) క్రింద భారతీయ వైద్య విధాన విద్యలో పాటించవలసిన నాణ్యత మరియు ప్రమాణములు;

(ఇ) 10వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి) క్రింద వైద్య సంస్థలు, వైద్య పరిశోధనలు మరియు వైద్య వృత్తి నిపుణులను క్రమబద్ధం చేయు రీతి;

(ఎఫ్) 10వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (డి) క్రింద కమీషను, స్వయంపాలక బోర్డులు మరియు రాజ్య వైద్య మండళ్ళు పనిచేయు రీతి;

(జి) 13వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద వైద్య సలహా మండలి సమావేశములలోని కోరంతో సహా దాని సమావేశములలో అనుసరించవలసిన ప్రక్రియ;

(హెచ్) 14వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ జాతీయ అర్హతతో సహా ప్రవేశ పరీక్షను నిర్వహించవలసినట్టి ఇతర భాషలు మరియు రీతి;

(ఐ) 14వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద వైద్య సంస్థలలో ప్రవేశము కొరకు పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థచే ఉమ్మడి కౌన్సిలింగును నిర్వహించు రీతి;

(జె) 14వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు విద్యార్థుల ప్రవేశపు రీతి;

(కె) 15వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పదాభిదానం చేయబడిన ప్రాధికార సంస్థ ద్వారా జాతీయ నిష్క్రమణ పరీక్ష నిర్వహించవలసిన ఇతర భాషలు మరియు రీతి;

(ఎల్) 15వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద విదేశీ వైద్య అర్హతను కలిగివున్న వ్యక్తి జాతీయ నిష్క్రమణ పరీక్షలో అర్హత పొందవలసిన రీతి;

(ఎమ్) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పదాభిదానము చేయబడిన ప్రాధికార సంస్థ, పోస్టుగ్రాడ్యుయేటు కోర్సులకు ప్రవేశమును నిర్వహించునట్టి ఇతర భాషలు మరియు రీతి;

(ఎన్) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద అన్ని వైద్య సంస్థలలోని పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల కొరకు పదాభిదానము చేయబడిన ప్రాధికార సంస్థచే ఉమ్మడి కౌన్సిలింగును నిర్వహించు రీతి;

(ఓ) 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద భారతీయ వైద్య విధానము కొరకు జాతీయ ఉపాధ్యాయుల అర్హతా పరీక్షను నిర్వహించు రీతి మరియు అట్టి పరీక్షను నిర్వహించునట్టి పదాభిదానము చేయబడిన ప్రాధికార సంస్థ;

(పి) 23వ పరిచ్ఛేదము క్రింద స్వయంపాలక బోర్డులకు కమీషనుచే లభ్యముగా ఉండబడవలసినట్టి నిపుణులు, వృత్తిపరమైన నిపుణులు, అధికారులు మరియు ఇతర ఉద్యోగుల సంఖ్య మరియు రీతి;

(క్యు) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద స్వయంపాలక బోర్డులు చేయవలసిన నిర్ణయముల రీతి;

(ఆర్) 26వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి) క్రింద అన్ని స్థాయిలలో సామర్థ్య ఆధారిత క్రియాశీల పాఠ్యప్రణాళిక;

(ఎస్) 26వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (సి) క్రింద ఆయుర్వేద, యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పాలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ మరియు సూపర్ స్పెషాలిటీ కోర్సులను బోధించు రీతి;

(టి) 26వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (డి) క్రింద వైద్య సంస్థలలో కోర్సులు మరియు పరీక్షలను నిర్వహించుట కొరకు కనీస ఆవశ్యకతలు మరియు ప్రమాణములు;

(యు) 26వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఇ) క్రింద భారతీయ వైద్య విధాన వైద్య సంస్థలలో మౌలిక సదుపాయములు, ఫ్యాకల్టీ మరియు విద్య మరియు పరిశోధన, నాణ్యత కొరకు ప్రమాణములు మరియు విధివిధానములు;

(వి) 27వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి) క్రింద వృత్తిపరమైన నడవడి, క్రమబద్ధం చేయునట్టి మరియు వైద్య నైతిక విలువలను పెంపొందించు రీతి;

(డబ్ల్యు) 28వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఎ) క్రింద వైద్య సంస్థల మదింపు మరియు రేటింగు కార్యవిధానము;

(ఎక్స్) 25వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (సి) క్రింద మదింపు మరియు రేటింగు కొరకు వైద్య సంస్థల తనిఖీని నిర్వహించు రీతి;

(వై) 28వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (డి) క్రింద అన్ని వైద్య సంస్థల మదింపు మరియు రేటును నిర్వహించుటకై స్వతంత్ర రేటింగు ఏజెన్సీలను నిర్వహించునట్టి మరియు జాబితాను రూపొందించునట్టి రీతి;

(జెడ్) 28వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఇ) క్రింద వైద్య సంస్థల మదింపు మరియు రేటింగులను వెబ్‌సైటులో లేదా ప్రజా బాహుళ్యంలో లభ్యంగా ఉంచు రీతి;

(జెడ్ఏ) 28వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (ఎఫ్) క్రింద కనీస అత్యవసర ప్రమాణాలను పాటించుటలో విఫలమైనందుకు గాను వైద్య సంస్థలపై తీసుకొనునట్టి చర్యలు;

(జెడ్బి) 29వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద కొత్త వైద్య కళాశాలను స్థాపించుట కొరకు పథకము యొక్క ప్రరూపము, దాని యొక్క వివరములు, దానితోపాటు చెల్లించవలసిన ఫీజు మరియు పథకమును సమర్పించునట్టి రీతి;

(జెడ్సి) 29వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (5) క్రింద పథకం ఆమోదము కొరకు కమీషనుకు అపీలును దాఖలుచేయు రీతి;

(జెడ్డి) 30వ పరిచ్ఛేదమునకు గల వినాయింపు క్రింద సడలించదగు ప్రమాణములకు సంబంధించిన ప్రాంతములు;

(జెడ్ఇ) 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద రిజిష్టరు చేయబడిన వైద్య ప్రాక్టీషనరు యొక్క వృత్తిపరమైన లేదా నైతిక దుర్వర్తనకు రాజ్య వైద్య మండలిచే క్రమశిక్షణా చర్యను తీసుకొను రీతి మరియు భారతీయ వైద్య విధాన నైతిక విలువలు మరియు రిజిస్ట్రేషను బోర్డుచే ఫిర్యాదులు మరియు వ్యథలను స్వీకరించుటకు కార్యవిధానము;

(జెడ్ఎఫ్) 31వ పరిచ్ఛేదమునకు గల విశదీకరణలోని ఖండము (బి) క్రింద వృత్తిపరమైన లేదా నైతిక దుర్వర్తనకు తుల్యమగు చర్యను చేయుట లేక చేయకుండా ఉండుట;

(జెడ్జి) 32వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జాతీయ రిజిష్టరులో ఉండవలసిన ఇతర వివరములు;

(జెడ్హెచ్) 32వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఎలక్ట్రానిక్ ప్రరూపముతో సహా జాతీయ రిజిష్టరు ప్రరూపము మరియు దానిని నిర్వహించు రీతి;

(జెడ్ఐ) 32వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద జాతీయ రిజిష్టరుకు చేర్చబడునట్టి లేదా దాని నుండి తొలగించబడునట్టి ఏదేని నామము లేదా అర్హత రీతి మరియు అట్లు తొలగించుటకు గల కారణములు;

(జెడ్జె) 33వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రాజ్య రిజిష్టరు లేదా జాతీయ రిజిష్టరులో బిరుదు, డిప్లొమా లేదా అర్హతను నమోదు చేయు రీతి;

(జెడ్కె) 34వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1)కి గల రెండవ వినాయింపు క్రింద, ఒక విదేశీ పౌరునికి అనుమతించదగు తాత్కాలిక రిజిస్ట్రేషను రీతి మరియు దాని కాలావధి;

(జెడ్ఎల్) 35వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద భారతదేశంలోని విశ్వవిద్యాలయము లేదా వైద్య సంస్థచే మంజూరు చేయబడిన వైద్య అర్హతలను జాబితాగా రూపొందించునట్టి మరియు నిర్వహించునట్టి రీతి;

(జెడ్ఎమ్) 35వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద గుర్తింపును మంజూరు చేయుటకై దరఖాస్తును పరిశీలించు రీతి;

(జెడ్ఎన్) 35వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (5) క్రింద గుర్తింపును మంజూరు చేయుటకై, కమీషనుకు అపీలును దాఖలుచేయు రీతి;

(జెడ్ఓ) 35వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (6) క్రింద బోర్డుచే నిర్వహించబడిన జాబితాలో వైద్య అర్హతను చేర్చునట్టి రీతి;

(జెడ్పి) 35వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (8) క్రింద ఈ చట్టము ప్రారంభపు తేదీకి ముందుగా గుర్తింపు మంజూరు చేయబడిన వైద్య అర్హతలను ఆయుర్వేద బోర్డు లేక యునాని, సిద్ధ మరియు సోవా-రిగ్పా బోర్డు జాబితాగా రూపొందించి మరియు నిర్వహించవలసినట్టి రీతి;

(జెడ్క్యు) 36వ పరిచ్ఛేదపు, ఉప-పరిచ్ఛేదము (4) క్రింద ఈ చట్టము ప్రారంభపు తేదీకి ముందుగా గుర్తింపు మంజూరు చేయబడిన వైద్య అర్హతలను కమీషను జాబితాగా రూపొందించి మరియు నిర్వహించవలసినట్టి రీతి;

పార్లమెంటు సమక్షములో నియమములను మరియు వినియమములను ఉంచుట.

56. ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వము చేసిన ప్రతి నియమమును, దానిని చేసిన వెంటనే అపుడు పార్లమెంటు అధివేశనమునందున్నచో దాని ప్రతియొక సదనము సమక్షమున మొత్తము ముప్పది దినముల కాలావధి పాటు ఉండవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనములోగాని లేదా రెండు లేదా అంతకంటే ఎక్కువ అనుక్రమ అధివేశనములలో గాని చేరియుండవచ్చును. అట్లు దానిని ఉంచిన అవ్యవహితానంతర అధివేశనమునగాని లేదా పైన పేర్కొనిన అనుక్రమ అధివేశనములు ముగియుటకు పూర్వము ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సభలు అంగీకరించినచో లేదా ఆ నియమమును చేయరాదని ఉభయ సభలు అంగీకరించినచో ఆ నియమము అటుపిమ్మట అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే అమలు కలిగియుండును లేదా సందర్భానుసారముగ అమలును కలిగియుండదు. అయినప్పటికిని ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని ఆ నియమము క్రింద అంతకు పూర్వము చేయబడిన ఏదేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

ఇబ్బందులను తొలగించుటకు అధికారములు.

57. (1) ఈ చట్టము నిబంధనలను అమలుపరచుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినచో, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో ఉత్తరువును ప్రచురించుట ద్వారా ఆ ఇబ్బందులను తొలగించుటకు అవసరమని భావించినట్లుగా ఈ చట్టములోని నిబంధనలకు అసంగతము కాని అట్టి నిబంధనలను చేయవచ్చును:

అయితే, ఈ చట్టము ప్రారంభపు తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి ముగిసిన పిమ్మట ఈ పరిచ్ఛేదము క్రింద ఏ ఉత్తరువు చేయబడరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతియొక ఉత్తరువును అది చేయబడిన వెంటనే పార్లమెంటు ఉభయ సభల సమక్షమునందు ఉంచవలెను.

58. (1) ఇందు నిమిత్తము కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీ నుండి భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వది) రద్దగును మరియు సదరు చట్టములోని 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేసిన భారతీయ వైద్య కేంద్ర మండలి విఘటనమగును. రద్దు మరియు వ్యావృతి.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనినట్టి చట్టము రద్దయినప్పటికీ, అది ఈ క్రింది వాటిని ప్రభావితం చేయదు,-

(ఎ) ఆ విధముగా రద్దు చేయబడిన చట్టము యొక్క గత అమలును లేదా దాని క్రింద యథాక్రమముగా చేసిన లేక అనుభవించిన దేనినైననూ;

(బి) అట్లు రద్దు చేయబడిన చట్టము క్రింద పొందిన, ప్రాప్తించిన లేదా వహించిన ఏదేని హక్కు, ప్రత్యేక హక్కు, బాధ్యత లేదా దాయిత్వము;

(సి) అట్లు రద్దు చేయబడిన చట్టము క్రింద ఏదేని ఉల్లంఘనలకు సంబంధించి భరించిన ఏదేని జరిమానా; లేదా

(డి) పైన పేర్కొనినట్టి ఏదేని అట్టి హక్కు, ప్రత్యేక హక్కు, బాధ్యత, దాయిత్వము, జరిమానాకు సంబంధించి ఏదేని శాసనిక చర్య లేదా ప్రత్యుపాయము, ప్రారంభించునట్టి, కొనసాగించునట్టి లేదా అమలుచేయునట్టి ఏదేని అట్టి శాసనిక చర్య లేదా ప్రత్యుపాయము మరియు ఆ చట్టము రద్దు చేయబడనట్లుగా భావిస్తూ విధించదగు ఏదేని అట్టి జరిమానా.

(3) భారతీయ వైద్య కేంద్ర మండలి పరిసమాపనము అయిన మీదట, అట్టి పరిసమాపనకు అవ్యవహితాపూర్వము మండలి ఛైర్మన్‌గా నియమించబడిన వ్యక్తి మరియు సభ్యుడిగా నియమించబడిన ప్రతియొక ఇతర వ్యక్తి మరియు మండలి యొక్క ఎవరేని అధికారి ఎవరేని ఇతర ఉద్యోగులు మరియు పదవిలో ఉన్నటువంటి వారు తమ సంబంధిత పదవులను ఖాళీ చేయవలెను మరియు అట్టి ఛైర్మన్ మరియు ఇతర సభ్యులు, తమ పదవి లేదా ఏదేని కాంట్రాక్టు సర్వీసు కాలావధి గడువుకు ముందుగా సమాప్తి అయినందుకు గాను మూడు మాసముల జీతబత్తెములకు మించని పరిహారమును క్లెయిము చేయుటకు హక్కు కలిగివుందురు:

అయితే, భారతీయ వైద్య కేంద్ర మండలి పరిసమాపనకు అవ్యవహితాపూర్వము డిప్యూటేషనుపై భారతీయ వైద్య కేంద్ర మండలికి నియమించబడిన ఎవరేని అధికారి లేదా ఇతర ఉద్యోగి, అట్టి పరిసమాపనము మీదట వారి మూల కేడర్, మంత్రిత్వశాఖ లేదా శాఖకు సందర్భాన్నిబట్టి తిరిగి పంపడం జరుగుతుంది:

అంతేకాకుండా, భారతీయ వైద్య కేంద్ర మండలి పరిసమాపనకు అవ్యవహితాపూర్వము క్రమబద్ధ ప్రాతిపదికపై లేదా కాంట్రాక్టు ప్రాతిపదికపై నియమించబడిన ఎవరేని అధికారి, నిపుణుడు, వృత్తిపరమైన నిపుణుడు లేదా ఇతర ఉద్యోగి, కేంద్ర మండలిలో అట్టి ఉద్యోగి నిపుణుడు, వృత్తిపరమైన నిపుణుడు లేదా ఇతర ఉద్యోగిగా ఉండుట నుండి వైదొలగవలెను.

మరియు అతనిని ఉద్యోగము నుండి గడువుకు ముందుగా తొలగించినందుకు గాను విహితపరచబడునట్టి మూడు మాసములకు తక్కువకాని జీతబత్తెములను పరిహారముగా పొందుటకు అర్హులై ఉందురు.

(4) పైన పేర్కొన్న శాసనము రద్దైనప్పటికీ, చేసిన ఏదేని ఉత్తరువు, ప్రాక్టీసు చేయుటకు జారీచేసిన ఏదేని లైసెన్సు, చేసిన ఏదేని రిజిస్ట్రేషను, కొత్త వైద్య సంస్థను ప్రారంభించుటకు లేదా ఉన్నత అధ్యయన కోర్సులను ప్రారంభించుటకు లేదా మంజూరు చేయబడిన ప్రవేశ సామర్థ్యాన్ని పెంచుటకు ఏదేని అనుమతి, ఈ చట్టపు ప్రారంభపు తేదీనాటికి అమలులో ఉన్న భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వది) క్రింద మంజూరు చేయబడిన ఏవేని వైద్య అర్హతల గుర్తింపు, ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన నియమములు లేదా వినియమములలోని నిబంధనల క్రింద జారీచేయబడినట్లుగా లేదా మంజూరు చేయబడినట్లుగా భావిస్తూ, అన్ని ప్రయోజనముల నిమిత్తము అవి పరిసమాప్తి అగు తేదీ వరకు అమలులో కొనసాగవలెను.

[1][(5) భారతీయ వైద్య కేంద్ర మండలి (సవరణ) చట్టము, 2020 (2020లోని 25వది)చే చొప్పించినట్లుగా, భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వది) యొక్క 3ఏ పరిచ్ఛేదము క్రింద కేంద్ర మండలిని తిరిగి ఏర్పాటు చేయుటకైన కాలావధి ముగిసినప్పటికీ, ఆ పరిచ్ఛేదపు (4)వ ఉప-పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన పాలక మండలిచే చేయబడిన అన్ని చర్యలు మరియు భారతీయ వైద్య కేంద్ర మండలి (సవరణ) అధ్యాదేశము, 2021 (2021లోని 5వ అధ్యాదేశము)చే సవరణ చేయబడి, రద్దు చేయబడిన చట్టము క్రింద దానిచే వినియోగించబడిన మరియు నిర్వహించబడిన కేంద్ర మండలి యొక్క అన్ని అధికారములు మరియు కృత్యములు, ఈ చట్టము అమలులోనికి రాకముందు వెనువెంటనే ఈ చట్టము యొక్క నిబంధనల క్రింద చేయబడిన లేదా తీసుకొనబడినవిగా భావించబడవలెను మరియు ఈ చట్టము క్రింద ఏదైనా చేయబడిన దానిచే లేదా ఏదైనా తీసుకొనబడిన చర్యచే రద్దు అయినప్పటికీ తదనుసారముగా అమలు కొనసాగవలెను.]

సంధికాల నిబంధనలు.

59. (1) కమీషను, దాని అనుబంధ సంస్థలు మరియు దాని స్వామిత్వములో ఉన్న ట్రస్టులతో సహా భారత వైద్య కేంద్ర మండలికి హిత ఉత్తరాధికారిగా ఉండవలెను మరియు భారతీయ వైద్య కేంద్ర మండలి యొక్క అన్ని ఆస్తులు మరియు అప్పులు కమీషనుకు అంతరణ చేయబడినట్లుగా భావించబడవలెను.

---

1. 2021లోని 38వ చట్టము ద్వారా, 2వ పరిచ్ఛేదము (18-08-2021వ తేదీ నుండి) చొప్పించబడినది.

(2) భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 (1970లోని 48వది) రద్దైనప్పటికీ, భారతీయ వైద్య కేంద్ర మండలి చట్టము, 1970 మరియు దాని క్రింద చేసిన నియమములు మరియు వినియమములలోని వైద్య ప్రమాణములు, ఆవశ్యకతలు మరియు ఇతర నిబంధనలు, ఈ చట్టము లేదా దాని క్రింద చేసిన నియమములు లేదా వినియమముల క్రింద క్రొత్త ప్రమాణములు మరియు ఆవశ్యకతలు నిర్దిష్టపరచబడు వరకు అమలులో కొనసాగవలెను మరియు నిర్వహణలో ఉండవలెను:

అయితే, రద్దు క్రింద ఉన్న శాసనము మరియు దాని క్రింద చేయబడిన నియమములు మరియు వినియమముల క్రింద వైద్య ప్రమాణములు మరియు ఆవశ్యకతల విషయములో చేసినది ఏదైనా లేదా తీసుకొనిన ఏదేని చర్య, ఈ చట్టములో వాటికి అనుగుణమైన నిబంధన క్రింద చేయబడినట్లుగా లేదా తీసుకొనబడినట్లుగా భావించబడవలెను మరియు ఈ చట్టము క్రింద చేసిన దేని ద్వారా లేదా తీసుకొనిన ఏదేని చర్య ద్వారా రద్దు చేయబడిననే తప్ప, మరియు రద్దు చేయబడువరకు తదనుసారముగా అమలులో కొనసాగవలెను.

(3) కేంద్ర ప్రభుత్వము, పరిసమాపనము చేయబడిన భారతీయ వైద్య కేంద్ర మండలి, ఈ చట్టము క్రింద దానికి అనుగుణమైన కొత్త కమీషనుకు సజావుగా పరిణామ మార్పు కొరకు అవసరమగునట్టి తగిన చర్యను తీసుకొనవచ్చును.